సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY
శుక్రవారం-7.2.2025 | హైదరాబాద్ సంపుటి -2 సంచిక-285 | పేజీలు -8 వెల: రూ.2
www.nedudailynews.com



నగరం నడిబొడ్డున ఉన్న బంజారాహిల్స్ లో సుమారు 300 కోట్ల విలువైన ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కబ్జాదారులు వరుస ప్రయత్నాలు చేస్తుండడం కలకలం సృష్టిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక భూ వ్యవహారాలు, సెటిల్మెంట్లు తెరమీదకు వచ్చిన సంగతి తెలిసిందే.. 3

# స్కెచ్

## వెనకాల ఉన్నది ఎవరు

- బంజారాహిల్స్ లో భూ కబ్జాకు వరుస ప్రయత్నాలు
- ప్రభుత్వ పెద్దల అండ ఉందంటూ ఆరోపణలు
- రూ.300 కోట్ల విలువైన స్థలంపై కన్ను

హైదరాబాద్, నేడున్యూస్: ఇదే క్రమంలో షేక్ పేట మండలం పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 లోని జలమండలి రిజర్వాయర్ పక్కన ఉన్న ఐదు ఎకరాల ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని బోగస్ పత్రాలతో ఆక్రమించేందుకు గత కొన్నేళ్లుగా ఓ వ్యక్తి ప్రయత్నాలు చేస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో రెండు సార్లు స్థలం ఆక్రమణకు ఓ వ్యక్తి చేసిన ప్రయత్నాలను షేక్ పేట మండల రెవెన్యూ అధికారులు వమ్ము చేశారు. రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదులతో సదరుమీద రెండు క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఆయనతో పాటు అతడి అనుచరులు జైలుకు సైతం వెళ్లి వచ్చారు. అయితే ఏడాదిన్నర క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి బంజారాహిల్స్ స్థలంపై కన్నేసిన ఆ వ్యక్తి ముందుగా స్థానిక ప్రజా ప్రతినిధిని





# గీత దాటొద్దు

- సమస్యలుంటే నాకు లేదు మంత్రులకు చెప్పండి
- ప్రత్యేకంగా మీటింగ్ పెట్టడమో మీడియాలో మాట్లాడడమో చేస్తే చర్యలు తప్పవు
- లేకపోతే నేరుగా రాహుల్‌గాంధికి చెప్పండి
- ఇక డిన్నర్ మీటింగ్‌లు వద్దు
- సీఎల్పీ మీటింగ్‌లో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక

హైదరాబాద్, నేడున్యూస్: కాంగ్రెస్ శాసనసభాపక్ష సమా వేశం హాట్ హాట్‌గా సాగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు రావడంతో పాటు ఇటీవల ఎమ్మెల్యేల రహస్య భేటీపై గురువారం సీఎల్పీ సమావేశంలో తీవ్ర చర్చ జరిగింది.

కులగణన ను వ్యతిరేకించడమే కాకుండా కులగణన ప్రతులను కాల్చివేసిన పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీకి పలువు రు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినట్లుగా తెలిసింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ పార్టీలో ఎంత పెద్ద నాయకులైనా పార్టీ గీత దాటొద్దని హెచ్చరించారు.

ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను కేబినెట్‌లో ఆమోదం పొందాక సొంత పార్టీ నుంచే విమర్శలు వినిపిస్తే ప్రజలోకి తప్పుడు సంకేతాలు వెళ్లుతాయని, వాటి ని బయట మాట్లాడొద్దని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. జడ్చర్ల ఎమ్మె ల్యే అనిరుద్‌రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యేల సమావేశం అంశంపైన చర్చ జరిగింది.

తమ సమావేశంలో ఎలాంటి రాజకీయం లేదని, డిన్నర్ కోసమే కలిశామని ఎమ్మె ల్యే అనిరుద్‌రెడ్డి, మరి కొందరు వివరణ ఇచ్చారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ పార్టీలో ఏమైనా అంతర్గత సమస్యలుంటే చెప్పుకోవడానికి తనతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ అందుబాటులో ఉంటామన్నారు.

అవసరమైతే ఏఐసీసీ అధ్యక్షు డు మల్లిఖార్జున ఖర్గేను కలిసి కూడా సమస్యలు చెప్పుకోవచ్చని సీఎం సూచించా రు. ఇక నుంచి డిన్నర్ మీటింగ్‌లు పెట్టుకోవద్దని,

## కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ

ఏఐసీసీ ప్రధాన కార్య దర్శి, పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్‌తో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఢిల్లీలో భేటీ అయ్యా రు.రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన కులగణన, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు. వీటితోపాటు పీసీసీ కార్యవర్గ కూర్పు, త్వరలో జరగబో యే స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించే వ్యూహాలపై చర్చించినట్లు తెలిసింది.

పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ నియమితులైన నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. ఇంకా పాత కార్యవర్గాన్నే కొనసాగిస్తున్నారు. కొత్త కార్యవర్గంలో చోటుకు చాలామంది ప్రయత్నిస్తున్నారు. మంత్రులు, జిల్లాలకు చెందిన సీనియర్ నాయకులతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే సలహాలు, సూచనలు తీసుకుని ఒక నివేదిక తయారుచేశారు. నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. 2



# తెల్లారక ముందే

- సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు
- విద్యార్థుల ఇంటి తలుపుతట్టే కార్యక్రమాన్ని ప్రారంభించిన పాలనాధికారి
- ఓ పదో తరగతి విద్యార్థి ఇంటికి వెళ్లి చదువుపై ఆరా 2

హైదరాబాద్, నేడున్యూస్: పదో తరగతి ఫలితాల్లో 100 శాతం సాధించడమే లక్ష్యంగా యాదాద్రి భువన్గగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు విద్యార్థుల ఇంటి తలుపు తట్టే కార్యక్రమాన్ని సంస్థాన్ నారాయణపురం మండలం కంకణాల గూడెంలో ప్రారంభించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థుల హాస్టల్‌లో

# అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవించలేదు

- ఎన్నికల్లో ఆయన్ను రెండుసార్లు ఓడించింది
- రాజకీయ ప్రయోజనం కోసమే ఇప్పుడు జై భీమ్ నినాదం
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం చర్చలో ప్రధాని మోదీ

దేశానికి ఎదురయ్యే సమస్యలను తెలివిగా పరిష్కరించుకోవాలి. ఎప్పుడూ దేశ ప్రగతి గురించే మా ఆలోచన ఉంటుంది. పేదప్రజల ఉన్నతి కోసమే మా కార్యక్రమాలు ఉంటాయి. పదేళ్లుగా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం. దశాబ్దాలుగా ఓబీసీలు నిరాశలో కూరుకుపోయారు. ఓబీసీ ఎంపీల ప్రతిపాదనలను కాంగ్రెస్ తిరస్కరించింది. ఓబీసీ ఎంపీల ప్రతిపాదనలను కాంగ్రెస్ తిరస్కరించింది. ఓబీసీ ఎంపీల ఇబ్బందులు, కష్టాలు మేం విన్నాం.

–ప్రధాని నరేంద్ర మోదీ



2


# పవర్ షాక్

- విద్యుత్ డిమాండ్‌లో సరికొత్త రకార్డు 2
- గురువారం 15, 752 మెగావాట్లకు చేరిన డిమాండ్
- వేసవి కన్నా ముందుగానే గరిష్టస్థాయికి చేరుకున్న విద్యుత్ వినియోగం

హైదరాబాద్, నేడున్యూస్: తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ అత్యధికంగా రికార్డ్ స్థాయిలో 15,752 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. గత ఏడాది మార్చి 8న అత్యధికంగా 15,623 మెగావాట్ల డిమాండ్‌ను అధిగమించినట్లు విద్యుత్‌శాఖ ప్రకటించింది. వ్యవసాయానికి, పరిశ్రమలకు విద్యుత్ వినియోగం పెరగడంతో పాటు గృహవినియోగం భారీగా పెరగంతోనే విద్యుత్ డిమాండ్ నమోదు అవుతుందని విద్యుత్ శాఖ అంచనావేస్తుంది. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,000ల మెగావాట్లకు చేరుకుంటుందని విద్యుత్ శాఖ అంచనావేస్తుంది. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నామని విద్యుత్ శాఖ స్పష్టం చేసింది.

భారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు : రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోతున్నాయి. ఫిబ్రవరిలోనే ఎండలు దంచికొడుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో పాటు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగిపోతుంది. ఒకపక్క యాసంగి పంటలకు సైతం విద్యుత్ వినియోగిస్తున్నారు. మరోపక్క పరిశ్రమలకు వినియోగం భారీగా పెరిగిపోయింది. గృహవినియోగం కూడా భారీగానే పెరిగిపోయినట్లు విద్యుత్ శాఖ అంచనావేస్తుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రికార్డ్ స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదు అవుతుందని విద్యుత్ శాఖ భావిస్తుంది.

గత ఏడాది డిసెంబర్ నెలలో 12,666 మెగావాట్లు నమోదు కాగా, ఈ ఏడాది డిసెంబర్ లో 14,375 మెగావాట్ల విద్యుత్





2

# తెలంగాణకు కేంద్రం నిధులు

హైదరాబాద్, నేడున్యూస్: తెలంగాణ రవాణా శాఖ అత్యుత్తమ పనితీరును ప్రదర్శించింది. దీంతో కేంద్ర రవాణా శాఖ రాష్ట్ర రవా ణా శాఖకు నజరానా అందించింది. రాష్ట్రంలో వంద శాతం ఆర్టీఏ ట్యాక్స్ వసూలుతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాల స్క్రాపింగ్ లక్ష్యాన్ని సైతం చేరుకోవడంతో పాటు ప్రభుత్వ వాహనాల స్క్రాపింగ్ ప్రణాళికను సైతం సిద్ధం చేసినందుకు కేంద్రం తెలంగాణకు ప్రత్యేకంగా నిధులు అందజే సింది.

కేంద్రం నిర్ధేశించిన 3 ఇనీషియేటివ్స్, మైల్‌స్టోన్స్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు చూపి కేంద్రం నుంచి నిధులు రాబట్టింది.



# ఇది భారత్‌కు అవమానం

- పార్లమెంటులో విపక్షాలు ఆందోళన
- అక్రమవలసదారుల కాళ్లకు గొలుసులు!
- ప్రభుత్వ తీరును ప్రశ్నించిన ఎంపీలు
- వివరణ ఇచ్చిన విదేశాంగ మంత్రి
- భారత మెతక వైఖరే కారణం అంటున్న నేతలు 2

# యూజీసీ నిబంధనలతో సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

- ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు అన్యాయం చేయొద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి విజ్ఞప్తి 3



# పీఈ సెట్, ఎడ్‌సెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, నేడున్యూస్: తెలంగాణలో పీఈ సెట్, ఎడ్‌సెట్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి గురువారం విడుదల చేసిం ది. మార్చి 12న పీఈ సెట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. మార్చి 15 నుంచి మే 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అపరాధ రుసుముతో మే 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు



## తెల్లారక ముందే

బుధవారం రాత్రి బస చేసిన కలెక్టర్, అక్కడి పదో తరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడి ప్రేరణ కలిగించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అనంతరం అక్కడే నిద్రపోయారు.

**విద్యార్థి ఇంటి తలుపు తట్టిన కలెక్టర్**

మరుసటి రోజు గురువారం తెల్లవారుజామున 5 గంటలకే 3 కి.మీ దూరంలోని చిన్న పల్లెటూరును కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. విద్యా స్థాయిలో సి గ్రేడ్‌లో ఉన్నటువంటి దేవరకొండ భరత్ చంద్ర అనే విద్యార్థి ఇంటికి ఆయన వెళ్లారు. అతని ఇంటి తలుపు తట్టారు. తాను జిల్లా కలెక్టర్‌ను అని పరిచయం చేసుకొని విద్యార్థితో పాటు అతని తల్లితో మాట్లాడారు. 50 రోజుల పాటు ప్రణాళిక బద్ధంగా కృషి చేసి చదివితే పదో తరగతిలో ఉత్తీర్ణుడయ్యే అవకాశం ఉందని వివరించారు.

**తన గొప్ప మనసు చాటుకున్న పాలనాధికారి**

విద్యార్థి పోషకాహార లోపంతో బలహీనంగా ఉండడాన్ని గుర్తించిన కలెక్టర్ హనుమంతరావు, అతని పోషణ కోసం నెలకు రూ.5000 చొప్పున తన సొంత డబ్బులు అందిస్తానని ప్రకటించి అప్పటికప్పుడే ఆ డబ్బులు అందజేశారు. విద్యార్థి చదువుకునేందుకు స్టడీ చైర్, ఫ్లాంక్, రాత పుస్తకాలు, పెన్నులను బహుమతిగా అందించారు. పంచాయతీ కార్యదర్శి సుభాస్‌కు విద్యార్థి చదువును, అతని అవసరాలను పర్యవేక్షించాలని బాధ్యతను అప్పగించారు.

# గీత దాటొద్దు

అవసరమైతే గాంధీభవన్‌లో అందరూ కూర్చొని సమావేశాలు ఏర్పా టు చేసుకోవాలని సీఎం హితవు పలికారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు కొన్ని ఇబ్బందులు ఉంటాయని, వాటిని పరిష్కరించుకుని ముందుకు వెళ్లాలన్నా రు.

పార్టీలో కార్యకర్త నుంచి నాయకుడి వరకు కలిసికట్టుగా ఉంటేనే అన్నింటిలో విజయం సాధించడానికి అవకాశం ఉంటుందని సీఎం సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

**అసైన్డ్ భూముల కబ్జాపై విచారణ..**

బీఆర్ఎస్ హయాంలో జరిగిన అసైన్డ్ భూముల కబ్జాపై విచారణ జరిపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా సమాచారం. రాష్ట్రంలో గత ప్రభుత్వాలు పేదలకిచ్చిన అసైన్డ్ భూములను కొందరకు బీఆర్ఎస్ నాయకులు కబ్జాలు చేశారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఆధారాలతో సహా వినతిపత్రాలు అందజేశారు.

పఠాన్‌చెరు నియోజక వర్గంలోని ఆమీన్‌పూర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బినామీలు అసైన్డ్ భూములను అక్రమించారని, దీనిపై విచారణ జరపాలని గతంలో కోరితే పట్టించుకోలేదని, వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా పేదల కోసమే ఆలోచన చేస్తుందని, ప్రభుత్వ భూములు కబ్జాకు పాల్పడిన వారిలో ఎవరున్నా సహించేది లేదని సీఎం హెచ్చరించినట్లు తెలిసింది.

**సమన్వయంతో ముందుకెళ్లాలి : దీపాదాస్ మున్షీ**

మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ నాయకులు నుంచి కార్యకర్తల వరకు సమన్వయంతో ముందుకు వెళ్లాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సూచించారు. పార్టీ నిర్ణయాలపై బహాటంగా విమర్శలు చేయవద్దన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల రహస్య సమావేశంపైన ఆమె ఆరా తీసినట్లుగా తెలిసింది.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు, ఎమ్మెల్యేలతోనూ సమస్యలుంటే.. వారితో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేల రహస్య సమావేశం అనేది జరగలేదని, ఎమ్మెల్యేలు కలిసి డిన్నర్ చేస్తే తప్పేంటన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు క్రమశిక్షణ కింద నోటీసు ఇచ్చామన్నారు. ఒక వేళ నోటీసు రాలేదంటే మళ్లీ ఇస్తామన్నారు. మల్లన్న నుంచి వివరణ వచ్చాక చర్యలు ఉంటాయని తెలిపారు.

సీఎల్పీ సమావేశంలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వర్గీకరణ, కుల గణనపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉందని, అయినప్పటికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని, అందుకనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, కులగణన చేపట్టిందన్నారు. కులగణనతో బీసీల రిజర్వేషన్లు పెరుగుతాయని, వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భట్టి సూచించారు.

**గజ్వేల్, సూర్యాపేటలో సభలు**

దశాబ్దాల పాటు పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ, కులగణన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పరిష్కరించిందని, అందుకు రాష్ట్రంలో రెండు భారీ బహిరంగ సభలను ఈ నెలలోనే ఏర్పాటుచేయాలని సీఎల్పీ సమావేశంలో నిర్ణయిం చారు.

ఎస్సీ ర్గీకరణకు సంబంధించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను ఆహ్వానిం చి గజ్వేల్‌లో, బీసీ కుల గణనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానించి సూర్యాపేటలో సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బీజేపీతో లోపాయికారి ఒప్పందం కోసమే కేటీఆర్ ఢిల్లీకి పోయారని విమర్శించారు. ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలు నివృత్తి చేశామని, రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు చెప్పారు. కులగణన విషయంలో బీసీ సంఘాలను తప్పుదోవ పట్టించే విధంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. వర్గీకరణ, కులగణనపై ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు.



**బీసీలకు 42 శాతం పదవులు..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఇది పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉం డేలా, బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా చూ డాలని ఎమ్మెల్యేలను సీఎం ఆదేశించారు. బీసీ నాయకత్వాన్ని ముందుకు తేవడానికి, వారికి అధికారంలో మద్దతుగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

పాత, కొత్త నేతలు సమన్వయంతో పని చేయాలి..

స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని అందుకు పాత, కొత్త నేతలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. పార్టీ నేతలు, కేడర్ అంతా ఒకతాటిపై నిలిచి పనిచేస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో మరింత దృఢంగా నిలిచేలా చేస్తుందని, అందుకు ప్రతి నియోజకవర్గంలో సమర్థవంతమైన ఎన్నికల ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రజలకు చేరువుగా ఉంటూ ప్రభుత్వ పథకాలను గట్టిగా ప్రచారం చేయాలన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రభావాన్ని నిలబెట్టుకోవాలని, ప్రతీ స్థాయిలో విజయం సాధించే బాధ్యత ఎమ్మెల్యేలపైనే ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కులగణన, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశాలు చారిత్రాత్మక నిర్ణయాలని, వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు.

మండలాల వారిగా సమావేశాలు నిర్వహించే బాధ్యతలను డీసీసీ అధ్యక్షులు తీసుకో వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ బలోపే తానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం పూర్తి స్థాయి లో పని చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో కాంగ్రెస్ బలా న్ని పెంపెందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఏకగ్రీవ విజయం సాధించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.

ఏడాదిలో ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలును వేగవంతం చేయాలని సీఎం సూచించా రు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, వివిధ నిర్మాణలకు అనుమతులు మంజూరు చేయడం, నిధులు కేటాయింపు కోసం తక్షణమే మంత్రును కలవాలన్నారు.రైతు రుణమాఫీ, రైతు భరోసాతో పాటు ఉచిత కరెంట్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం తదితర పథ కాలను ప్రజలకు వివరించాలన్నారు.

## పీఈ సెట్, ఎడ్‌సెట్ షెడ్యూల్ విడుదల

అవకాశం కల్పించామని ఉన్నత విద్యా మండలి వెల్లడిం చింది. జూన్ 11 నుంచి 14 వరకు పీఈ సెట్ పరీక్షలు జరుగుతాయి.

**మార్చి 10న ఎడ్‌సెట్ నోటిఫికేషన్**

తెలంగాణ ఎడ్‌సెట్ షెడ్యూల్‌ను కాకతీయ వర్సిటీ విడుదల చేసింది. మార్చి 10న ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 12 నుంచి మే 13 వరకు అప్లికేషన్లు స్వీకరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. జూన్ 1వ తేదీన ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఎడ్‌సెట్ పరీక్షలు జరగనున్నాయి.



## స్కూల్‌లో భారీ అగ్ని ప్రమాదం

**17 మంది చిన్నారులు సజీవదహనం**

నైజీరియాలో విషాద సంఘటన చోటుచేసుకుంది. ఓ స్కూల్ లో భారీ అగ్ని ప్రమాదం జరగడంతో.. 17 మంది విద్యార్థులు సజీవదహనమయ్యారు. వివరాల్లోకి వెళితే..జంఫారా రాష్ట్రంలో కైరా నమోదా జిల్లాలోని ఓ ఇస్లామిక్ స్కూల్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 17 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఘటన సమయంలో బడిలో 100 మంది విద్యార్థులు ఉన్నట్లు జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తెలిపింది.

ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయడగా.. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాగా పాఠశాల పక్కనే నిల్వ ఉంచిన కర్రలకు మంటలు అంటుకుని ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబు బాధితుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పాఠశాలలను కోరారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఎప్పుడూ గౌరవించలేదు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందని ప్రధాని నరేంద్రమోదీ ఆరో పించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదా లు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని రాజ్యసభలో గురువారం ప్రసంగించారు. రాజ్యాంగాన్ని బీజేపీ నాశనం చేస్తుం దంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను దీటుగా తిప్పికొట్టారు.

అంబేద్కర్‌ను కాంగ్రె స్ ఏనాడూ గౌరవించలేదని విమర్శించారు. కాంగ్రెస్ బాబాసాహెబ్‌ను ఎన్నికల్లో రెండుసార్లు ఓడించిందని దుయ్యబట్టారు. భారత రత్న అవార్డుకు ఆయన అర్హుడని ఆ పార్టీ ఎ ప్పుడూ భావించలేదని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనం కోసం ఇప్పుడు 'జై భీమ్' నినాదాన్ని ఎత్తుకుందని వివమర్శించారు.

**కాంగ్రెస్‌కు అది వర్తించదు**

కాంగ్రెస్‌కు రాజ్యాంగం వర్తించదని ప్రధాని విమర్శించారు. ఎమర్జెన్సీ సమయం లో జార్జి ఫెర్నాండెజ్ వంటి నాయకులను కాంగ్రెస్ బంధించిందని దుయ్యబట్టారు. ఎ మర్జెన్సీకి బహిరంగంగా మద్దతు పలకాలని ప్రముఖ నటుడు దేవ్ ఆనంద్‌ను ఆనాడు కాంగ్రెస్ కోరిందని.. అయితే ఆయన ఆ ప్రతిపాదనను తిరస్కరించారని తెలిపారు. దానికి ప్రతీకారంగా కాంగ్రెస్ ఆయన సినిమాలు దూరదర్శన్‌లో ప్రసారం కాకుండా బ్యాన్ వి ధించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల ఆందోళనలో పాల్గొన్నందుకు ప్రముఖ నటుడు బలరాజ్ సాహ్నీని జైలుకు పంపినట్టు వెల్లడించారు.

దేశ వ్యాప్తంగా కులగణను చేయాలంటూ రాహుల్ గాంధీ చేస్తున్న డి మాండ్‌పై ప్రధాని తీవ్ర స్థాయిలో ధ్వ జమెత్తారు. కులాల పేరుతో విషాన్ని వ్యాప్తి చేయడానికి కుట్ర జరుగుతోందని హెచ్చరించారు. బీజేపీ ఓబీసీ ప్యా నెల్‌కు రాజ్యాంగ హోదా ఇచ్చిందన్నారు. భారతీయుల ఆత్మవిశ్వాసం, వికసిత్ భారత్ సంకల్పం గురించి రాష్ట్రపతి తన ప్ర సంగంలో వివరణాత్మక సందేశం ఇచ్చారని పేర్కొన్నారు.



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం తాజాగా ఇచ్చిన బైఅవుట్ ఆఫర్‌ను 40వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు అందిపుచ్చుకున్నా రు. తమ ఉద్యోగాన్ని స్వచ్ఛందంగా వదులుకుంటూ రాజీనామాను సమర్పించారు. ది ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్(ఓపీఎం) కూడా దీన్ని ధ్రువీకరించింది.

40వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ ఉద్యోగానికి రాజీనామా చేసినట్టు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఖర్చులు తగ్గించు కోవడంలో భాగంగా పనితీరు సరిగా లే ని, కార్యాలయాలకు వచ్చి పని చేయడానికి ఇష్టపడని ప్రభుత్వ ఉద్యోగులను తొలగించాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది.

సుమారు 20లక్షల మంది ఉ ద్యోగులకు ఓపీఎం ఈమెయిల్ పంపి.. స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకుంటే ఎనిమిది నెలల జీతం ఇవ్వను న్న ట్టు వెల్లడించింది. ఫిబ్రవరి 6వ తేదీలోగా ఈ విషయంలో ఓ నిర్ణయానికి రావాలని గడువు విధించింది.

# పవర్ షాక్

డిమాండ్‌కు చేరుకుంది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది 13.49శాతం విద్యుత్ అధికంగా పెరిగిందని విద్యుత్ శాఖ భావిస్తుంది. గత ఏడాది జనవరిలో 13,810 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైతే ఈ ఏడాది 15,205 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అదనంగా 10.10శాతం డిమాండ్ పెరిగింది.

**రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ వినియోగం**

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం కూడా భారీగానే పెరిగిపోతుంది. గత ఏడాది డిసెంబర్ లో 207.68 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగితే ఈ ఏడాది డిసెంబర్ లో 235.25 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగింది. గత ఏడాదితో పోల్చితే 13.28శాతం పెరిగింది. ఈ ఏడాది జనవరిలో 243.12 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటే ఈ ఏడాది జనవరిలో 260.56 మిలియన్ యూనిట్ల డిమాండ్‌కు పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే 7.17శాతం అదనంగా పెరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనావేస్తున్నారు.

ఉత్పత్తి సంస్థల విద్యుత్ యూనిట్‌కు రూ.4.50 ఉన్న సమయంలో రూ.2.72 కే ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడం ద్వారా విద్యుత్ సంస్థలు భారీగా ఆదా చేసినట్లు ట్రాన్స్ కో సీఎండీ కృష్ణభాస్కర్ తెలిపారు. తక్కువ ధరకే ఎక్స్ఛేంజీల ద్వారా విద్యుత్ కొనుగోలు చేయడంతో గడిచిన 13 నెలల్లో విద్యుత్ సంస్థలకు వెయ్యికోట్ల రూపాయల వరకు ఆదా అయినట్లు ఆయన పేర్కొన్నారు.

**జనవరిలో రూ.185.27 కోట్లు ఆదా చేశాం**

ఇటీవల డిసెంబర్, జనవరి మాసాల్లో ఒక్కో యూనిట్‌కు సరాసరి రూ.2.69 రూపాయల నుంచి రూ.2.89 రూపాయల మధ్య ఎక్స్ఛేంజీలో కొనుగోలు చేసినట్లు కృష్ణభాస్కర్ తెలిపారు. ఆ సమయంలో థర్మల్ స్టేషన్ లను బ్యాకింగ్ డౌన్ చేయడం వల్ల సాధారణంగా ఒక్కో యూనిట్ విద్యుత్ కు రూ.3.97 ల నుంచి రూ.4.18 వరకు యూనిట్ కు అయ్యే ఖర్చును తగ్గించగలిగామన్నారు. తద్వారా డిసెంబర్ లో రూ.196 కోట్లు, జనవరిలో రూ.185.27 కోట్లు ఆదా చేశామన్నారు.



ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ లో విద్యుత్ వినియోగం 17,000ల వరకు పెరుగుతుందని విద్యుత్ శాఖ అంచనావేస్తుంది. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినప్పటికీ విద్యుత్ శాఖ అందుకు సిద్దంగా ఉందని పేర్కొంది. ఏఈ స్థాయి అధికారుల నుంచి సీఎండీ స్థాయి అధికారుల వరకు క్షేత్రస్థాయిలో తిరుగడంతో పాటు, వేసవి విద్యుత్ ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన ట్రాన్స్ ఫార్మర్లను, విద్యుత్ పరికరాలను అందుబాటులో ఉంచుకుంటున్నారు.

# ఇది భారత్‌కు అవమానం

ఏజెంట్ల చేతిలో మోసపోయి అమెరికాలో అక్రమంగా ఉం టున్న వారిని అమెరికన్ ప్రభుత్వం అవమానకర రీతిలో వెనక్కు పంపింది. దీనిపై గురు వారం పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. మీ మెతక వైఖరి వల్లే ఈ పరిస్థితి తలెత్తిందంటూ ఆరోపించాయి.

విపక్షాల ఆ రోపణలకు మంత్రి జైశంకర్ సమాధానమిచ్చారు. డిపోర్టేషన్ ప్రక్రియ గురించి వివరిం చారు. అమెరికా ప్రభుత్వం అక్రమంగా ఉం టున్న భారతీయులతో దురుసుగా ప్రవర్తించకుండా వారితో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

అమెరికాలో అక్రమంగా ఉంటున్న 104 మంది భారతీయులతో మిలిటరీ విమానం అమృత్‌సర్‌కు చేరుకుంది. కేవలం ఒకే బాత్రూమ్ ఉన్న మిలటరీ విమానంలో పు రుషులు, మహిళలు, పిల్లలని చూడకుండా తీసుకొచ్చిన అమెరికా విధానం మీద పలువురు ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్లకార్డులతో నిరసన

ప్రతిపక్ష ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ నేత అఖిలేష్ యాదవ్ తదితరులు పార్లమెంట్ ఆవర ణలో నిరసనకు దిగారు. చేతులకు బేడీలు వేసి తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశం మీద ఇటు లోక్‌సభతో పాటు అటు రాజ్యసభ కూడా దద్దరిల్లింది. సమాజ్‌వాదీ, తృణమూల్, ఆప్, కమ్యూనిస్టులు ఈ అంశం మీద చర్చకు పట్టుబట్టా యి.

వాయిదా నోటీసులు అందజేశాయి. కానీ వారు అందించిన నోటీసులకు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ రిజెక్ట్ చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఇది విదేశీ వ్యవహారాలకు సంబంధించిన విషయం అని చెప్పి ఎంపీలను సముదాయించే ప్రయత్నం చేశారు. కానీ ఫలితం లేకపోవడంతో సభను వాయిదావేశారు. అనంతరం ఈ ఘటన మీద కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ సమాధానం చెప్పారు.

ఇదేం కొత్త కాదు..

డిపోర్టేషన్ ప్రక్రియ అనేది ఏం కొత్త కాదు అని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. 'ఎన్నో ఏండ్ల నుంచి యూఎస్‌లో అక్రమంగా ఉంటున్న వారిని ఇలాగే పంపుతున్నారు. కేవలం ఒక్క దేశం వారిని ఇలా పంపరు. ఏ దేశమైనా అక్రమ వలసదారులను వెనక్కి పంపుతుంది' అని అన్నారు. నిబంధనల మేరకే వారిని నిర్బంధిస్తారని, వారు టాయిలెట్‌కు వెళ్లే సమయంలో వాటిని తొలగిస్తారని తెలిపారు. ఇది చాలా రోజుల నుంచి జరుగు తున్న ప్రక్రియే అని వివరించారు. మహిళలు, చిన్నారులను నిర్బంధించలేదని ఐసీ ఈ అధికారులు తమకు తెలిపారని స్పష్టం చేశారు. అమెరికా నుంచి వచ్చిన వారికి అవసరం అయిన సదుపాయాలు సమకూర్చా మన్నారు. ఇకపై నుంచి డీపోర్టేషన్ చేస్తున్నపుడు వలసదారుల పట్ల దురుసుగా వ్యవహరించకుండా చూసేందుకు అమెరికాతో మాట్లాడతామని హామీనిచ్చారు.

ఈ రగడ జరుగుతుండగానే అమెరికా సరిహద్దు గస్తీ విభాగం చీఫ్ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో పెనుదుమారం రేపింది. 'చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉంటున్న విదే శీయులను విజయవంతంగా వెనక్కి పంపా ం' అని ఓ వీడియోను పోస్ట్ చేశారు. ఆ వీడియోలో సీ విమానం ఉంది. అందులోకి ఎక్కేవారికి సంకెళ్లు వేసి ఉన్నాయి. వారు భారతీయులే అని అంతా ఆరోపిస్తున్నారు.

అవి ఫేక్ ఫొటోలు

అమెరికా నుంచి భారత్‌కు వచ్చిన వలసదారుల కాళ్లకు గొలుసులు, చేతులకు బేడీ లు ఉన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు ఫేక్ అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తెలిపింది. 'ఆ ఫొటోలు ఇండియన్స్‌వి కావు. గ్వాటెమాల దేశస్తులవి' అని పేర్కొంది.

అవును బేడీలేశారు..

భారత్‌కు వచ్చిన తమకు బేడీలు వేసింది నిజమే అని బాధితుల్లో కొందరు పేర్కొన్నారు. 36 ఏండ్ల జస్‌పాల్ సింగ్ మాట్లాడుతూ.. 'మమ్మల్ని వేరే క్యాంప్‌కు తీసుకెళ్తున్నారని అనుకున్నాం. మిమ్మల్ని భారత్‌కు తీసుకె ళ్తున్నాం అని ఓ పోలీసాయన చెప్పా డు. మా చేతులకు బేడీలు, కాళ్లకు గొలుసులు కట్టారు' అని మీడియాకు వివరించారు.

ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత అక్రమ వలసదారుల బహిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) నిబంధనలు ఏం చెబుతున్నాయనే విషయాన్ని పరిశీలిస్తే.. ప్రజల భద్రతకు ముప్పు తలపట్టే, వీసాలను ఉల్లంఘున, నేరపూరిత మైన చర్యల్లో పాల్గొన్న అక్రమ వలసదారులను అమెరికా ప్రభుత్వం బంధిస్తుంది. ఆ తర్వాత వారిని ఇమ్మిగ్రేషన్ కోర్టులో ప్రవేశపెడుతుంది. కోర్టు ఆదేశాల ప్ర కా రం తొలుత సదరు అక్రమవలసదారులకు స్వచ్ఛందంగా దేశాన్ని వీడే అవకాశం ఇస్తుంది. ఒక వేళ అక్రమవలసదారులు అందుకు అంగీకరించకపోతే బలవంతంగానైనా స్వదేశానికి పంపిస్తుంది.

వారి బహిష్కరణకు అవకాశాలు తక్కువ

అమెరికాలో అక్రమంగా నివాసం ఉం టూ పట్టుబడ్డప్పటికీ కొన్ని సందర్భాల్లో బహిష్కరణ నుంచి తప్పించుకోవచ్చు. స్వదేశానికి వెళ్తే తమ ప్రాణానికి ముప్పు వాటిల్లుతుందని ఇమ్మిగ్రేషన్ కోర్టులో నిరూపించి ఆశ్రయం కోసం దరఖాస్తు చే సుకుంటే టెంపరరీ ప్రొటెక్టడ్ సేటస్(టీపీఎస్) ద్వారా బహిష్కరణ ముప్పు నుంచి తప్పించుకోవచ్చు.

మార్చి 31, 2024 నా టికి టీపీఎస్ కింద అమెరికాలో ఆశ్రయం పొందుతు న్న వారి సంఖ్య



8,63,880గా ఉంది. పిల్లలతో కలిసి అమెరికాకు అక్రమంగా ఎవరైనా వలస వెళ్తే వారి బహి ష్కరణ ప్రక్రియను డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌వుడ్ అరైవ్స్(డీఏసీఏ) నిబంధనలు ఆలస్యం చేస్తాయి.

డాలర్ కలల్ని నిజం చేసుకునేందుకు అందినకాడికి అప్పులు చేసి ఏజెంట్ల చేతిలో లక్షలు పోసిన అమాయకులు వారు మోసం చేయడంతో చేసేదేం లేక అక్రమమార్గాల్లో అగ్రరాజ్యానికి పయనం అయ్యారు. పనామా, మెక్సికో సరిహద్దులు దాటి అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించారు. ఈ తరుణంలో ఎన్నో అగచాట్లు పడ్డట్లు బాధితులు పేర్కొన్నారు.

**72 లక్షలు ఖర్చు చేశా**

హర్యానాకు చెందిన 20 ఏండ్ల ఆకాశ్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. 'ప్రమాదకరమైన మెక్సికో, పనామా భూభాగాలను దాటేందుకు రూ. 72 లక్షలు ఖర్చు చేశా' అని పేర్కొన్నాడు. ఆయన కుటుంబం విడుదల చేసిన వీడియోలో ఆకాశ్ పడిన కష్టాలు కనిపిస్తున్నాయి. అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నాలు చేస్తున్న ఇతరులతో కలిసి ఆకాశ్ ముందుకు సాగాడు. డాంకీ రూట్‌లో అతడు పడిన కష్టాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆకాశ్ ఒక్కడే కాకుండా ఎందరో ఇతర వలసదారులు కూడా ఇందులో కనిపిస్తున్నారు.

# తెలంగాణకు కేంద్రం నిధులు

తన అత్యుత్తమ పని తీరుతో మొత్తంగా తెలంగాణ రవాణా శాఖ రూ.176.5 కోట్ల నజరానా సాధించింది.

ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను రాయి తీ ప్రకటించడంతో పాటు విజయవంతంగా అమలు చేస్తున్నందుకు మైల్ స్టోన్ 1 సాధించినట్టుగా ప్రకటించిన కేంద్ర రవాణా శాఖ, అందుకు అనుగుణంగా రూ.50 కోట్ల నిధులను తెలంగాణకు కేటాయించింది.

1,000 ప్రభుత్వ వాహనాల స్క్రాపింగ్ కోసం ప్రత్యేకంగా ప్రణాళికను విడుదల చేయడం, 2114 ప్రభుత్వ వాహనాలను స్క్రాపింగ్ చేసినందుకు, 2,005 కాలం చెల్లిన వాహనాలను స్క్రాపింగ్ చేసినందుకు (95 శాతం టార్గెట్ పూర్తి) కేంద్రం రూ.75 కోట్లు విడుదల చేసింది. మైల్‌స్టోన్ 2 ద్వారా 1.5 రెట్లు ప్రయోజనం చేకూరింది.

21 ప్రాధాన్య కేంద్రాలు, 16 ప్రాధాన్యత లేని కేంద్రాల్లో 37 ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ల (ఏటీఎస్) ఏర్పాటుకు తెలంగాణ రవాణాశాఖ సిద్ధమైన నేపథ్యంలో వాటి ఏర్పాటుకు గానూ కేంద్రం రూ.51.5 కోట్లు కేటాయించింది.

**రవాణా శాఖ పనితీరు వల్లే నిధులు..**

తాము నిర్ధేశించిన నిబంధనల మేరకు తె లంగాణ రవాణాశాఖ పనిచేస్తున్న నేపథ్యం లో కేంద్రప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వి డుదలచేసింది. ఈ నిధులు తెలంగాణ రవా ణా శాఖ బలోపేతానికి ఎంతో ఉపయోగపడనున్నాయి. ఏటీఎస్ ఏర్పాటు, కాలం చెల్లి న వాహనాలను తొలగించి వాహన కాలుష్యాన్ని, ప్రమాదాలను తగ్గించేందుకు అవ కాశం ఏర్పడింది. మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను రాయితీ వల్ల పెద్దఎత్తున వీటి కొనుగోలు పెరిగి వాహనాల కాలుష్యం భా రీగా తగ్గే వీలుంది. తెలంగాణ ప్రభుత్వం తీ సుకుంటున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని రవాణా శాఖ అధికారులు అంటున్నారు.

**ఏటీఎస్ ఏర్పాటుతో..**

తెలంగాణలో ఏర్పాటు చేయనున్న 37 ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ల (ఏటీఎస్) వల్ల వాహనాల కండీషన్‌ను తెలుసుకునే వీలు ఏర్పడుతుంది. బ్రేకులు, లైట్లు, కాలుష్య విడుదల స్థాయి, వాహన ఫిట్‌నెస్‌ను పరీక్షించి వాటిని నడిపేందుకు అను గుణంగా ఉంటేనే అనుమతిస్తారు. మ్యానువల్ టెస్టిం గ్ కంటే ఏటీఎస్ ద్వారా కచ్చితమైన ఫలి తాలు వస్తాయి. తద్వారా ప్రమాదాలు తగ్గడంతో పాటు వాహన కాలుష్యాన్ని నియంత్రించే వీలుం టుంది. వాహనాల నిర్వహణకు అవకాశం ఏర్పడి వాటి జీవితకా లాన్ని పెంచే అవకాశం లభిస్తుంది.



### తెలంగాణ పోలీస్ శాఖలో

# మరో విషాదం

## భార్యతో గొడవపడి ఎస్సై సూసైడ్

### ములుగు జిల్లాలో ఘటన

తెలంగాణ పోలీస్ శాఖలో వరుస విషాదాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. రెండ్రోజుల క్రితం ఓ ఎస్సై రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. మరో ఎస్సై గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా.. ఓ ఏఆర్ ఎస్సై ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. భార్యతో గొడవపడి సూసైడ్ చేసుకున్నాడు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పస్రా గ్రామానికి చెందిన నర్సయ్య అనే వ్యక్తి ఆర్ఎస్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బయ్యారంలో విదులు నిర్వహిస్తున్నాడు. నర్సయ్య భార్య సునీత ములుగు జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నారు.

ఇటీవల విధులకు సెలవు పెట్టిన నర్సయ్య.. బుధవారం భార్య, పిల్లల వద్దకు వచ్చాడు. అయితే నిన్న సాయంత్రం భార్యతో గొడవపడి ఆమెను ఇంటి నుంచి గెంటేశాడు. దీంతో పిల్లలతో కలిసి సునీత హనుమకొండలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ తర్వాత రాత్రి నుంచి సునీత ఎన్నిసార్లు ఫోన్ చేసినా.. నర్సయ్య కాల్ లిఫ్ట్ చేయలేదు. దీంతో గొడవ విషయం బంధువులకు చెప్పింది. ఉదయాన్నే వారిని తీసుకొని ఇంటికి వెళ్లి తలుపు తట్టింది. ఎన్నిసార్లు తలుపు తట్టినా తీయకపోవటంతో స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా.. ఫ్యానుకు ఉరేసుకొని కనిపించాడు. దీంతో సునీక కన్నీరు మున్నీరుగా విలపించింది. ఘటనపై కేసు నమోదు చేసకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కుటుంబ కళహాలతోనే సూసైడ్ చేసుకున్నట్లు కేసు ఫైల్ చేశారు.

కాగా, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, ఆపై ఆత్మహత్యలు పెరిగిపోతున్న ఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోయాయి. ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో మంచి స్థానంలో ఉన్నవారు కూడా చిన్న చిన్న విషయాలకే గొడవ పడుతున్నారు. క్షణికావేశంతో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆధిపత్య ధోరణితో పంతాలకు పోయి ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇది మంచి పద్ధతి కాదని వ్యక్తిత్వ వికాస నిపుణులు అంటున్నారు. వివాహ బంధాన్ని నిలబెట్టుకోవాలంటే ఒకరినొకరు అర్థం చేసుకుని మెలగాలని సూచిస్తున్నారు.



# స్కెచ్

సంప్రదించినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. నాలుగైదు రోజులు ఆ స్థలంలో సదరు ప్రజాప్రతినిధికి చెందిన రౌడీలను కాపలాగా పెట్టారు. అయితే వాటాల వ్యవహారంలో బేరం కుదరకపోవడంతో సదర వ్యవహారం ముందుకు పోలేదని తెలిసింది. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన కీలక నేత కుటుంబ సభ్యుడిని ఓ మధ్యవర్తి ద్వారా సంప్రదించిన ఆయన కొడుకు మరోసారి తమ స్కెచ్ అమలు చేయాలని నిర్ణయించుకున్నారు . స్కెచ్ లో భాగంగా వేరే ప్రాంతంలోని బోగస్ పత్రాలను బంజారాహిల్స్ లోని స్థలం పత్రాలుగా నమ్మిస్తూ బెంగళూరుకు చెందిన ఓ బిల్డర్ ను రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సదరు బిల్డర్ కు డెవలప్ మెంట్ అగ్రిమెంటు ఇచ్చిన పార్థసారథి ఇటీవల గుట్టు చప్పుడు కాకుండా స్థలంలో తిష్ట వేశారు. తన అనుచరులను స్థలంలో ఉంచి పొజిషన్ తనవద్ద నే ఉందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడు.ఈ వ్యవహారం బయటికి పొక్కడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మరోసారి ఆ వ్యక్తి మనుషులను స్థానిక రెవెన్యూ అధికారులు ఖాళీ చేయించారు .ఈ మొత్తం వ్యవహారంలో రెవిన్యూ శాఖలో కీలక స్థానంలో ఓ ఉన్నతాధికారి, పోలీసు శాఖలో ఉన్న మరో అధికారి సదరు కబ్జాదారుడికి సాయం చేస్తున్నట్లు సమాచారం. వారి ఆశీస్సులు దక్కడంతోపాటు, ప్రభుత్వంలోని కీలక వ్యక్తి బంధువులు కూడా ఉన్నారని తెలుస్తోంది. ఈ స్థలాన్ని ఏదో విధంగా డెవలప్మెంట్ పేరుతో బిల్డర్ కు అప్పగించి సొమ్ము చేసుకునేందుకు ఇప్పటికే ఒప్పందాలు కూడా జరిగాయని సమాచారం. ఈ క్రమంలో ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు ఉండడం అనుమానాలను మరింత పెంచుతుంది. మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుంటున్న కబ్జాదారులు ఏకంగా రాజధాని నగరంలోనే రెచ్చిపోతుండడంతో.. వీరికి మద్దతు పలుకుతున్న వారు ఎవరు అనే అంశంపై విచారణ జరగాల్సి ఉంది. పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనానికి కూతవేటు దూరంలో జరుగుతున్న ఈ తతంగం మీద నగర పోలీసు కమిషనర్ దృష్టి సారించాలి అని స్థానికులు కోరుతున్నారు

## మస్తాన్ సాయిని కస్టడీకి ఇవ్వండి

లావణ్య కేసులో అరెస్టైన మస్తాన్‌సాయి కస్టడీ కోరుతు నార్సింగి పోలీసులు గురువారం కోర్టులో పిటీషన్ వేశారు. ఈ కేసులో మరిన్ని విషయాలు తెలుసుకునేందుకు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటీషన్‌లో కోరారు. మస్తాన్‌సాయిపై లావణ్య ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో లావణ్య నార్సింగి పోలీసులకు లావణ్య హార్డ్ డిస్క్ అందజేసిన విషయం తెలిసిందే. అందులో పలువురు యువతులు, వివాహితుల నగ్న వీడియోలు ఉండడంతో మర్ని వివరాల కోసం నార్సింగి పోలీసులు కస్టడీకి తీసుకుని విచారణ చేయాలని భావిస్తున్నారు. మస్తాన్ సాయిని వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్‌లో వందలాది వీడియోస్‌ను గుర్తించిన పోలీసులు, మొబైల్‌ను సీజ్ చేశారు. మస్తాన్ సాయి స్నేహితుడు కాజాను అరెస్ట్ చేసి 41 నోటీసులు జారీ చేశారు. డ్రగ్స్ టెస్ట్‌లోనూ మస్తాన్ సాయికి పాజిటివ్ రిపోర్ట్ వచ్చింది.

మస్తాన్ సాయి మొబైల్‌లో వేలాదిమంది అమ్మాయిల కాంటాక్ట్ లిస్ట్ ఉన్నట్లు తెలుస్తోంది. కస్టడీకి తీసుకున్న తర్వాత మస్తాన్‌సాయిని డ్రగ్స్ ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారని ఆరా తీయనున్నారు. నగ్న వీడియోలు, డ్రగ్స్ వ్యవహారంపై నార్సింగి పోలీసులు విచారణ చేస్తున్నారు. మస్తాన్ సాయి కొంతమంది యువతులను ట్రాప్ చేసి నగ్న వీడియోలు చిత్రీకరించి బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డాడని అభియోగాలు, ఆరోపణలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలను కూడా పోలీసులు సేకరించారు. డ్రగ్స్, నగ్న వీడియోలకు సంబంధించి పూర్తి స్థాయిలో నార్సింగ్ పోలీసులు విచారణ జరిపే అవకాశం ఉంది. లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు. మస్తాన్ సాయిని అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు కూడా తరలించారు.

# అన్నివిధాలుగా భరోసా ఇస్తాం

## ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నేడున్యూస్: మూసీ నది ప్రక్షాళనతో పేదల జీవితాలు పూర్తిగా మారిపోతాయని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులను స్పీకర్ గడ్డం ప్రసా మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌తో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు ప్రారం హిమాయత్‌సాగర్ వద్ద ఫిల్టర్‌బెడ్‌తో పాటు బండ్లగూడ నగరపాలక సంస్థ భవనాన్ని ప్రారంభించారు.

అనంతరం ఆ మాట్లాడుతూ.. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూసీ బాధితులను ఇబ్బంది పెట్టే ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నాయని తెలియజేశారు. మూసీలో ఇళ్లు కోల్పోతున్న వారికి విశ్వాసం, భరోసా కల్పించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.



పట్టణ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో గోదావరి నదీ జలాలు నగరానికి తీసుకొచ్చి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తర్వాత జంట నగరాలకు మూసీ నదిని జీవనదిని చేయడానికి ఏడు టీఎంసీల నీటిని తీసుకొచ్చి శుద్ధి చేస్తామని స్పష్టం చేశారు. బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలో గతంలో మిగిలిపోయిన రూ.215 కోట్ల పనులను పూర్తి చేశామని స్పష్టం చేశారు. ఓఆర్ఆర్ వరకు తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు కొత్తగా ఏర్పడిన కాలనీలకు సైతం తాగునీరు సరఫరా చేసేందుకు జలమండలి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మూడు రిజర్వాయర్లను నిర్మించారు. వాటిని మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. హిమాయత్‌సాగర్, బుద్వేల్, గండిపేటలో నిర్మించిన 11 ఎమ్మెల్డీల మూడు ప్రెషర్ ఫిల్టర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, మాజీ మేయర్లు లతాప్రేమ్‌గౌడ్, మహేందర్‌గౌడ్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీస్

హైదరాబాద్: బీసీ కుల గణన నివేదికపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ సీహెచ్.నవీన్ (తీన్మార్ మల్లన్న)కు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. కులగణన పూర్తి చేసి చరిత్ర సృష్టించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందిన సమయంలో పార్టీ నిబంధనలు ఉల్లంఘించి విమర్శలు చేయడాన్ని టీపీసీసీ తీవ్రంగా పరిగణించింది. రాహుల్ గాంధీ ఆదేశాలు, పార్టీ అధినాయకత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా పరుష పదజాలంతో చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 12లోగా వివరణ ఇవ్వాలని తీన్మార్ మల్లన్నను ఆదేశిస్తూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీచేశారు. కుల గణన నివేదికపై బీసీల మనోభావాలకు తూట్లు పొడిచేలా చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీకి పార్టీ శ్రేణులతో పాటు ఓబీసీ సంఘాల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని నోటీసు జారీ చేస్తున్నట్లు చిన్నారెడ్డి స్పష్టం చేశారు. కులగణన నివేదికపై మంత్రివర్గంలో చర్చించిన తర్వాత 10 శాతం ముస్లిం వర్గాలతో కలిపి రాష్ట్రంలో 56 శాతానికి పైగా బీసీలు ఉన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీగా బాధ్యతలను విస్మరించి, పార్టీ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా మాట్లాడడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. 12లోగా సరైన వివరణ అందించాలని, లేని పక్షంలో పార్టీ నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని నోటీసులో స్పష్టం చేశారు.

# సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

రాష్ట్ర వర్సిటీల్లో సెర్చ్ కమిటీల బా ధ్యతను గవర్నర్‌కు అప్పగించేలా యూజీసీ కొత్త నిబంధనలు ఉన్నాయని, దీంతో సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. యూజీసీ నూతన మార్గదర్శకా లపై కేంద్రం తీసుకునే నిర్ణయాల వల్ల ఇబ్బందిగా ఉం టుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి తమ అభిప్రాయాలు నివేదించినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్రమంత్రులు ధర్మేంద్రప్రధాన్, నితిన్‌గడ్కరీని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పలు అంశాలపై వినతులు ఇచ్చారు.



అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. నూతన నిబంధనల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. గవర్నర్ ద్వారా వర్సిటీలను కేంద్రం ఆధీనంలోకి తీసుకోవాలనుకుంటోందని విమర్శిం చారు. యూజీసీ నిబంధనల అభ్యంతరాలపై 6 పేజీలతో నివేదిక ఇచ్చామని, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని విన్నవించామన్నారు.

'దేశంలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, రాష్ట్ర పరిధిలోని యూనివర్సిటీల వైస్ చాన్సలర్ నియామకానికి వేసే సెర్చ్ కమిటీల బాధ్యతను పూర్తిగా గవర్నర్‌కు అప్పగించడం సరి కాదన్నారు. ఈ అంశంపై పార్టీ తరపున విద్యారంగ మేధావులతో ఒక సమావేశం ని ర్వహించిన తర్వాత తమ పార్టీ ఆలోచనలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామన్నారు.

"నో సూటబుల్ క్యాండిడేట్ ఫౌండ్" అనే నిబంధనను తీసుకురావడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్న రిజర్వేషన్ల ప్రకారం కాకుండా అభ్యర్థులు దొరకలేదనే సాకుతో ఆ ఉద్యోగాలు ఇతర కేటగిరీలతో భర్తీ చేసే ప్రమాదముందని, ఇది రాజ్యాంగం ఆయా సామాజికవర్గాలకు ఇచ్చిన రాజ్యాంగబద్ధమైన హక్కును హరించడమే అవుతుందని కేటీఆర్ తెలిపారు.

మరో వైపు ఎన్‌హెచ్ రహదారిని పొడిగించాలని కేంద్రమంత్రి నితీన్ గడ్కరీని కోరినట్లు చెప్పారు. మిడ్ మానేరు మీదుగా రోడ్ కమ్ రైల్ బ్రిడ్జిను ఏర్పాటు చేసి వేములవాడ మీదుగా కోరుట్లలో జాతీయ రహదారిని 63 కలిపేలా విస్తరించాలని విజ్ఞప్తి చేశామన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన పార్టీ తరఫున వేసిన కేసును కూడా ఫాలోఅప్ చేస్తామన్నారు. కచ్చితంగా పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన వేటుపడేలా కోర్టులో కొట్లాడుతామన్నారు.

# ఇకపై గిగ్ వర్కర్లకు పింఛన్!

- కోటి మందికిపైగా గిగ్ వర్కర్లకు శుభవార్త
- ప్రత్యేక పింఛను పథకానికి కార్మిక శాఖ రూపకల్పన
- త్వరలోనే కేంద్ర కేబినెట్ పరిశీలనకు దస్త్రం!

దేశంలోని వివిధ ఆన్‌లైన్ వేదికల్లో పనిచేస్తున్న కోటి మందికిపైగా గిగ్ వర్కర్లకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించనుంది! వారి కోసం ప్రత్యేక పింఛను పథకాన్ని అమలు చేసేందుకు మోదీ సర్కారు సన్నద్ధం అవుతోంది. త్వరలోనే ఈ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ పరిశీలనకు కార్మిక శాఖ పంపనున్నట్లు తెలుస్తోంది. గిగ్ వర్కర్లు విధి నిర్వహణ క్రమంలో చేసే ప్రతి లావాదేవీలో నుంచి కొంత మొత్తాన్ని సామాజిక భద్రతా చెల్లింపు కింద పింఛను ఖాతాలో జమ చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

ఆర్థిక అవసరాల కోసం కొన్ని రోజులు లేదా కొన్ని గంటలు స్విగ్గీ, ర్యాపిడో, ఓలా, జొమాటో, ఉబెర్, అమెజాన్ వంటి ఆన్‌లైన్ సర్వీసుల్లో పనిచేసే వారిని గిగ్ వర్కర్లు అంటారు. వీరి పని తాత్కాలికం, ఆదాయమూ తాత్కాలికమే. నెలవారీ వేతనం లభించదు.

### ప్రతి లావాదేవీలో నిర్దిష్ట మొత్తం పింఛనుకు

అందుకే గిగ్ వర్కర్ల ద్వారా జరిగే ప్రతి సర్వీసు లావాదేవీ నుంచి సామాజిక భద్రతా చెల్లింపు కోసం ఎప్పటికప్పుడు నిర్దిష్ట శాతంలో మొత్తాన్ని కేంద్ర కార్మికశాఖ స్వీకరించనుంది. ప్రతి లావాదేవీపై ఎంత శాతాన్ని పింఛను కోసం సేకరించాలనే దానిపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయాన్ని తీసుకోలేదు. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) తరహాలో ఈ మొత్తాన్ని ఆన్‌లైన్ సర్వీసుల సంస్థల బిల్లుల నుంచి నిర్బంధంగా సేకరిస్తారు. గిగ్ వర్కర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువ ఆన్‌లైన్ సర్వీసుల కోసం పనిచేసినా ఈ పింఛను పథకం ద్వారా లబ్ధి పొందొచ్చు.

### విత్‌డ్రాకు రెండు ఆప్షన్లు

పింఛను ఖాతాలో జమయ్యే డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు గిగ్ వర్కర్లకు రెండు ఆప్షన్లు ఇవ్వనున్నారు. పదవీ విరమణ పొందే సమయానికి పింఛను ఖాతాలో జమయ్యే డబ్బుపై వచ్చిన వడ్డీ ఆదాయాన్ని విత్ డ్రా చేసుకోవడం మొదటి ఆప్షన్. పింఛను ఖాతాలో జమైన డబ్బును కొన్ని ఈఎంఐలుగా విభజించుకొని, విడతలవారీగా ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలోకి పొందడం రెండో ఆప్షన్.

### కేంద్ర బడ్జెట్‌లోనూ వరాలు

ఇటీవలే కేంద్ర బడ్జెట్‌లోనూ గిగ్ వర్కర్లకు సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రకటనలు చేశారు. వారికి గుర్తింపు కార్డులను అందించడం సహా ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా వారికి ఆరోగ్య భద్రత కల్పిస్తామని నిర్మల వెల్లడించారు. రానున్న రోజుల్లో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి కూడా గిగ్ వర్కర్లు లబ్ధి పొందొచ్చు.

ఈ-శ్రమ్ పోర్టల్‌ను 2021 ఆగస్టులో ప్రారంభించారు. అసంఘటిత రంగంలోని కార్మికుల వివరాల నమోదు కోసం, వారికి సహాయ సహకారాలను అందించేందుకు దీన్ని తీసుకొచ్చారు. 2025 జనవరి 27 నాటికి దేశవ్యాప్తంగా 30.58 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకున్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన 12 పథకాలను దీనితో ఏకీకృతం చేశారు.



# శిర్డీ వెళ్లే భక్తులకు అలర్ట్

## ఇకపై ఉచిత భోజనానికి టోకెన్ తప్పనిసరి

శిర్డీ సాయిబాబా భక్తులకు అలర్ట్. సాయి ప్రసాదాలయం నిబంధనలలో కీలక మార్పులు చేసింది సాయిబాబా సంస్థాన్. మద్యపానం, ధూమపానం, నేర ప్రవృత్తి ఉన్నవారిని అరికట్టేందుకు ప్రసాదాలయంలో టోకెన్ వ్యవస్థను అమలు చేయాలని నిర్ణయించింది. సాయి దర్శనం తర్వాత ఉచిత భోజన టోకెన్లను అందించడానికి ఏర్పాట్లు చేసింది. గురువారం(ఫిబ్రవరి 6) ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. ఇప్పుడు టోకెన్ లేకుండా భక్తులు ప్రసాదాలయంలోని ప్రవేశించలేరని సాయి సంస్థాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గోరక్ష్ గాడిల్కర్ తెలిపారు.




### రోజుకు 50వేల మందికి ఉచిత భోజనం

శిర్డీలోని సాయి బాబా సంస్థాన్ ఆధ్వర్యంలో నడిచే భోజనశాలలో రోజుకు సగటున యాభై వేల మంది భక్తులు ఉచిత సాయి ప్రసాదాన్ని తింటున్నారని చెప్పారు గోరక్ష్ గాడిల్కర్. అదే సమయంలో నేర ప్రవృత్తి ఉన్నవారు, డ్రగ్స్ బానిసలు, ధూమపానం చేసేవారు కూడా భోజనశాలలోకి ప్రవేశించి తింటున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని వెల్లడించారు. అందుకే అలాంటివారు భోజనశాలలోకి ప్రవేశించకుండా ఉండేందుకు సాయిబాబా సంస్థాన్ క్ొన్ని ఆంక్షలు విధించిందని తెలిపారు.

సాయిబాబా దర్శనం అనంతరం బయటకు వచ్చే భక్తులకు సాయి ప్రసాదాలయంలో ఉచిత భోజన టోకెన్‌తో పాటు విభూది, బూందీ ప్రసాదాన్ని అందిస్తాం. ఒకవేళ దర్శనానికి ముందే భోజనం చేయాలనుకునే భక్తులకు ప్రసాదాలయంలో ఉచితంగా టోకెన్లు అందజేస్తాం. సాయి సంస్థాన్ ఆధ్వర్యంలో నడిచే రెండు ఆస్పత్రుల రోగులు, వారి కుటుంబీకులకు వసతి ఏర్పాట్లు చేస్తాం. అలాగే ఉచిత భోజన టోకెన్లు కూడా ఇస్తాం. శిర్డీకి వచ్చే ఏ భక్తుడూ ఆకలితో ఉండరు." అని సాయి సంస్థాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గోరక్ష్ గాడిల్కర్ పేర్కొన్నారు.

### ఇద్దరు ఉద్యోగుల హత్య నేపథ్యంలో అలర్ట్

ఇటీవలే సాయి సంస్థాన్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు దారుణ హత్యకు గురయ్యారు. దీంతో అక్కడి పరిపాలనా యంత్రాంగం, సాయి సంస్థాన్ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో శిర్డీలో నేరాలను తగ్గించేందుకు పలు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ప్రసాదాలయంలో ప్రవేశించేవారికి టోకెన్‌ను తప్పనిసరి చేసింది. దేశం నలుమూలల నుంచి ప్రజలు ఉచితంగా భోజనం చేసేందుకు శిర్డీకి వస్తుంటారని బీజేపీ మాజీ ఎంపీ సుజయ్ విఖే పాటిల్ ఆరోపించారు. మహారాష్ట్రలోని యాచకులంతా శిర్డీలోనే గుమిగూడారని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సాయి ప్రసాదాలయంలో ఉచిత భోజనం ఆపేయాలని, భోజనానికి డబ్బులు వసూలు చేయాలని డిమాండ్లు వచ్చాయి. ఇప్పుడు సాయి సంస్థన్ కీలక మార్పులు చేపట్టింది.



## ప్రైవేట్ ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చొద్దు

హైదరాబాద్, నేడున్యూస్: చట్టప్రకారం ఉన్న నిబంధనల మేరకే ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చాలని, దానికి విరుద్ధంగా తీసుకున్న ఏ నిర్ణయమైనా చట్టవిరుద్ధమేనని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రైవేట్ పట్టా ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చే అధికారం ప్రభుత్వా నికిగానీ, అధికారులకుగానీ లేదని, దీనికి సంబంధించి చట్టమే స్పష్టంగా పేర్కొందని వెల్లడించింది.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో వ్యవసాయ భూమిని విక్రయించడానికిగానూ ధరణి పోర్టల్‌లో స్లాట్ బుకింగ్‌కు అవకాశం లేకుండా బ్లాక్ చేయడాన్ని సవాలు చేస్తూ బాచుపల్లికి చెందిన ఎస్ వెంకటసుబ్బయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు.

పిటిషనర్ తరపు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ సర్వే నెం.132/సి/బి/1/2 లోని 1.26 ఎకరాలను సాదా బైనామా కింద కొనుగోలు చేశారన్నారు. 1992లో చట్టప్రకారం క్రమబద్ధీకరించుకున్నారని, దీనికి సంబంధించి పట్టా కూడా జారీ అయిందన్నారు. ఈ భూమిని విక్రయించడానికి రిజిస్ట్రేషన్ ఫీజు తదితరాలు ఈ చలానా రూ.30.35 లక్షలు చెల్లించి విక్రయం కోసం స్లాట్ బుక్ చేసుకోవాలనుకుంటే బ్లాక్ చేశారన్నారు.జుల్ఫికర్ అలీఖాన్ అనే వ్యక్తి ఇచ్చిన వినతిపత్రం ఆధారంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) రిజిస్ట్రేషన్ కాకుండా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇలా రిజిస్ట్రేషన్‌ను నిలిపేసే అధికారం సీసీఎల్‌ఏకు లేదని తెలిపారు.

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద అనుసరించాల్సిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చలేరని, మార్గదర్శకాలకు విరుద్ధంగా తీసుకున్న నిర్ణయాలు చెల్లుబాటుకావని స్పష్టం చేశారు.

అంతేకాకుండా సెక్షన్ 22ఏ లో ఆస్తులను చేర్చే అంశానికి సంబంధించి వింజమూరి రాజగోపాలాచారి వర్సెస్ రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి కేసులో ఇదే హైకోర్టు ఫుల్‌బెంచ్ మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు.

నిషేధిత జాబితాలోని ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయరాదన్న మార్గదర్శకాలను రిజిస్ట్రేషన్ అధికారులు అమలు చేయాల్సి ఉందన్నారు.



# సీఎం పీఏలైనా టికెట్ కొనాల్సిందే

అమరావతి: ప్రతి ఒక్కరూ సమాజం గురించి ఆలోచించి.... సమాజానికి ఏదో ఒకటి చేయాలని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. తలసీమియా బాధిత పిల్లల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యూజికల్ షో గురించి వివరించేందుకు సంగీత దర్శకుడు తమన్‌తో కలిసి గురువారం ఆమె విజయవాడలో మీడియాతో మాటాడ్లారు. ''సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు అనే స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు స్థాపించాం. తలసీమియా బాధిత పిల్లలకు రెండు లేదా నాలుగు నెలల్లో రక్తమార్పిడి చేయాల్సి ఉంటుంది. దీనికి ఎంతో రక్తం అవసరం. ప్రతి ఒక్కరూ, కుటుంబ సభ్యులతో సహా రక్తదానం చేయాలి. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసీమియా సెంటర్లు ప్రారంభించాలని అనుకున్నాం. ఈ సెంటర్లకు నిధుల సేకరణ కోసమే ఈ మ్యూజికల్ షో ఏర్పాటు చేశాం. దీని గురించి చెప్పగానే తమన్ అంగీకరించారు. మా ట్రస్ట్ చేసే కార్యక్రమాలు చూసిన తర్వాత షో మొత్తం ఫ్రీగా చేస్తానని అంగీకరించారు'' అని భువనేశ్వరి తెలిపారు. ఈనెల 15వ తేదీన విజయవాడలో 'యుఫోరియా మ్యూజికల్ షో' పేరుతో దీనిని నిర్వహిస్తున్నామని... బుక్ మై షోలో టికెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

రెండు రాష్ట్రాల్లో తలసీమియా సెంటర్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని భువనేశ్వరి తెలిపారు. ''ప్రస్తుతం హైదరాబాద్‌లో చిన్న సెంటర్‌ను ఏర్పాటు చేశాం. అది సరిపోవడం లేదు. విశాఖ, తిరుపతి, హైదరాబాద్, రాజమండ్రిలో బ్లడ్ బ్యాంక్‌లున్నాయి. అక్కడే తలసీమియా సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఇనిసిట్యూట్‌కు ప్రభుత్వం కొంత స్థలాన్ని ఇచ్చింది. అందులో బాలకృష్ణ ఆస్పత్రి ఏర్పాటు చేస్తారు'' అని తెలిపారు. సీఎం సతీమణిగా ప్రభుత్వ మద్దతు ఉంటుంది కదా... ఈ షో నిర్వహించడం ఎందుకనే ప్రశ్నకు భువనేశ్వరి సూటిగా బదులిచ్చారు. ''ఐ యామ్ భువనేశ్వరి. పదవులు వస్తాయి.. వెళ్తాయి. అది నాకు ముఖ్యం కాదు. నేను నా కాళ్ల మీద నిలబడాలని అనుకుంటాను. సీఎం చంద్రబాబును నేను ఏదీ అడగను. ఒకవేళ... ఎన్టీఆర్ ట్రస్ట్, హెరిటేజ్ గురించి అడిగినా ఆయన వెంటనే 'నో' చెబుతారు. ఇప్పుడు కూడా మ్యూజికల్ షో నిర్వహిస్తున్నానని చెప్పగానే... 'మీరు చేయండి. మీరు చేయగలరు' అని మాత్రమే చెప్పారు. మ్యూజికల్ షోకు ఎవరైనా టికెట్ కొని రావాల్సిందే అని స్పష్టం చేశారు. ''మా కుటుంబానికి సంబంధించి రూ.6 లక్షలు తన వ్యక్తిగత ఖాతా నుంచి చెల్లించి చంద్రబాబు ఒక టేబుల్ బుక్ చేశారు. షోకు ఎవ్వరూ ఫ్రీగా రావడానికి లేదు. సీఎం చంద్రబాబుతోపాటు వచ్చే పీఏలు కూడా టికెటు కొని రావాల్సిందే'' అని భువనేశ్వరి నవ్వుతూనే సూటిగా చెప్పారు. ఈ కార్యక్రమానికి పవన్ కల్యాణ్‌ను ఫోన్ చేసి పిలిచానని, తప్పకుండా వస్తారని అనుకుంటున్నానని చెప్పారు.

ఆనందంగా ఉంది: తమన్

''సీఎం చంద్రబాబు రాష్ట్రం కోసం చాలా చేస్తున్నారు. భువనేశ్వరి కూడా చాలా మంచి పనులు చేస్తున్నారు. నాపై నమ్మకముంచి ఈ షో చేయిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. షో ద్వారా వచ్చే ప్రతి రూపాయి పిల్లలకు అందిస్తాం. 50 మంది సింగర్స్ పాల్గొంటున్నారు. సీఎం చంద్రబాబు, ఎండీ భువనేశ్వరి, హీరో బాలకృష్ణ తదితరులు హాజరవుతారు. ఇది అతి పెద్ద షో అవుతుంది. దీనిని విజయవంతం చేయడానికి మా టీమ్ కష్టపడుతోంది. షోను కొత్తగా చేయాలని ఆలోచిస్తున్నాం'' అని తమన్ తెలిపారు. భువనేశ్వరి చాలా ఎనర్జిటిక్ అని ప్రశంసించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అంటే ఆత్మ గౌరవానికి ప్రతీకని ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్ అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌ను 1997లో చంద్రబాబు నాయుడు ప్రారంభించారని చెప్పారు.\

# విజయసాయిరెడ్డి అయినా ఎవరైనా అంతే..

అమరావతి: రాజకీయ నాయకుడికి క్యారెక్టర్, క్రెడిబిలిటీ ఉండాలని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. వైసీపీని వీడిన విజయసాయిరెడ్డికి కూడా ఇది వర్తిస్తుందని తెలిపారు. గురువారం తాడేపల్లి ప్యాల్‌సలో తన అనుకూల మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి వైసీపీని వీడడంపై అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. 'వైసీపీకి 11 మంది రాజ్యసభ సభ్యులు.. వీరిలో పోయినోళ్లు ముగ్గురు. సాయిరెడ్డితో కలిపితే నలుగురు. రాజకీయాల్లో ఉన్నప్పుడు క్యారెక్టర్ ముఖ్యం. క్రెడిబిలిటీ అనే పదానికి అర్థం తెలియాలి. రాజకీయాల్లో ఉన్నప్పుడు.. ఫలానా వాడు నాయకుడని కాలర్ ఎగరేసుకుని చెప్పుకోవాలి. అది సీఎం అయినా.. ఎంపీ అయినా.. ఎమ్మెల్యే అయినా సరే.. ఎవరి గురించైనా గొప్పగా చెప్పుకోవాలి. కానీ మనమంతట మనమే ప్రలోభాలకు లొంగో.. భయపడో.. ఏదో కారణం చేత మన వ్యక్తిత్వాన్ని.. క్రెడిబిలిటీని పణంగా పెట్టి.. కాంప్రమైజ్ అయి అటువైపు పోతే మన గౌరవం ఏంది.. మన వాల్యూ ఏంది? మన క్యారెక్టర్ ఏంది? మన క్రెడిబిలిటీ ఏంది.. అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి. కష్టం ఎల్లకాలం ఉండదు.. డెమోక్రసీ అంటేనే ఐదేళ్లు. అది సాయిరెడ్డికైనా.. పోయిన ముగ్గురు ఎంపీలకైనా.. ఒకడో అరో పోతే వారికైనా అంతే' అని జగన్ అన్నారు. మూలనున్న ముసలమ్మా బటన్ నొక్కుతుందని.. ఇందులో వింతేముందంటూ గతంలో తేలిగ్గా మాట్లాడిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ఎందుకు బటన్ నొక్కలేదని జగన్ ప్రశ్నించారు. బటన్ నొక్కితే జేబుల్లోకి డబ్బులు రావనే ఆయన డీబీటీ కింద నిధులివ్వడం లేదని

NAME CHANGE
Yerukali Rishika Change to name
Yerukali Rishitha DOB 04-10-2010
HNO: 1-53 ,village ,tharamathipet,
ABDULLAPURMET mandal,
rangareddy district .501505

B.Baswaraj ,Bcom,
LLB,advocate Notary Appointed By Gov,Ap
16-11-16/1/2/A .....Saleem Nagar,Malakpet,
Hyderabad.500036.Telangana.



## తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు

# ముహూర్తం ఖరారు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర సచివాలయంలో ఇవాళ భేటీ అయిన ఏపీ కేబినెట్ మొత్తం 21 అంశాలకు ఆమోద ముద్ర వేసింది. ఏప్రిల్ నెల నుంచే ఏపీలో మత్స్యకార భరోసా అమలు చేయాలని ఏపీ మంత్రి వర్గం నిర్ణయించింది. మరోవైపు.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలులోకి తీసుకురావాలని నిర్ణయం చీసుకుంది. మరోవైపు.. అన్నదాత సుఖీభవ పథకం కోసం విధివిధానాలు రూపొందించాలని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు.

మరోవైపు.. వచ్చే 3 నెలల పాటు జనంలోకి వెళ్లాలని.. మంత్రులకు సూచించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని హితవు పలికారు. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యత మొత్తం మంత్రులే తీసుకోవాలని వెల్లడించారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల మార్జిన్‌ను భారీగా పెంచుతూ ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 10.5 శాతం ఉన్న లిక్కర్ షాపుల మార్జిన్‌ను 14 శాతానికి పెంచేందుకు ఏపీ మంత్రివర్గం అంగీకారం తెలిపింది.

ఇదే సమయంలో ఎంఎస్ఎంఈ, ఎంఈడీపీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, టెక్స్‌టైల్ అండ్ గార్మెంట్స్ పాలసీల్లో పలు సవరణలకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా పారిశ్రామిక వేత్తలకు చేయూతను అందించేలా విధానాల్లో సవరణలకు కేబినెట్ అంగీకారం తెలిపింది. ఇలాంటి వారికి విద్యుత్ సహా పలు విభాగాల్లో ప్రత్యేక రాయితీలు, అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వాలని



నిర్ణయించింది. ఇటీవల సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఆమోదం తెలిపిన దాదాపు రూ.45 వేల కోట్ల పెట్టుబడులకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

మరోవైపు.. రాష్ట్రంలో 2014-2019 మధ్య చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ అధికారంలో ఉండగా చేపట్టిన నీరు-చెట్టు పనులకు సంబంధించి ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న బిల్లులకు మంత్రివర్గం మోక్షం కల్పించింది. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నిర్మించే ఇళ్లకు కొత్త టెండర్లు పిలిచే అంశంపైనా మంత్రివర్గంలో చర్చ జరిపారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో పోటు కార్మికులకు సంబంధించిన 15 పోస్టులను సూపర్‌వైజర్ స్థాయికి పెంచేందుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. తిరుపతి జిల్లా తమ్మినపట్నం.. కొత్తపట్నంలో చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి పరిహారం కింద ఒక్కో ఎకరానికి రూ.8 లక్షల చొప్పున దాదాపు రూ.79 కోట్లు చెల్లించేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది.



# విశాఖ నుంచి కాకినాడ వరకు లగ్జరీ నౌక

ఏపీలో పర్యాటకుల కోసం 'క్రూజ్ పర్యటన'పై నిర్వాహకులు దృష్టిసారించారు. ఇప్పటికే పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఆ దిశగా కసరత్తు జరిగింది. విశాఖపట్నం నుంచి విలాసవంతమైన నౌక (లగ్జరీ యాచ్) నడిపేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ తో డాల్ఫిన్ ఓషన్ క్రూజెస్ సంస్థ ఇటీవల ఎంవోయూ కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

మూడు, నాలుగు గంటల పాటు సముద్రంపైనే: విశాఖ ఫిషింగ్‌హార్బర్ వద్ద పర్యాటకులను నౌకలో ఎక్కించుకొని సముద్రంలోనే మూడు, నాలుగు గంటల పాటు విహరింపజేసేలా ప్లాన్ చేస్తున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయాలలో ఈ ప్యాకేజీలు అందుబాటులో ఉంటాయి. 15 నాటికల్ మైళ్లకు లోపల, అంతర్జాతీయ సరిహద్దు వెలుపలే ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అదే విధంగా ఈ నౌకను విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు నడపాలనుకుంటున్నారు. విశాఖలో పర్యాటకులను ఎక్కించుకొని కాకినాడ వరకు తీసుకుని వెళ్తారు. అక్కడి నుంచి విశాఖకు రిటర్న్ అవుతారు.

మరో ప్లాన్: విశాఖ నుంచి కాకినాడ మీదుగా నెల్లూరు వరకు తీసుకువెళ్లేలా మరో ప్లాన్ ఉంది. అయితే అక్కడ పర్యాటకులకు అవసరమైన జెట్టీల సౌకర్యంపై ఆలోచిస్తున్నారు. వీటిని పర్యాటకుల డిమాండ్ ఆధారంగా నడపాలని చూస్తున్నారు. పర్యాటకులు నౌకల్లోకి ఎక్కిదిగేందుకు చాలా చోట్ల హార్బర్లు, జెట్టీలు లేవు. విశాఖలో ఫిషింగ్ హార్బర్‌తో పాటు ఇంటర్నేషన్ క్రూజ్ టెర్మినల్ సైతం రెడీ ఉంది. దీంతో ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న వాటితోనే నిర్వహించాలనుకుంటున్నారు.

ఇవీ వివరాలు:

50 మందికి సరిపోయేలా ఈ నౌకను తయారు చేయిస్తున్నారు.

మరుగుదొడ్లతో కూడిన రెండు విలాసవంతమైన ఏసీ రూమ్‌లు ఉంటాయి. అందులోనే తాగునీరు ఉంటుంది.

మిగిలిన పర్యాటకులకు మరుగుదొడ్లు, ఆతిథ్య సేవలకు ప్రత్యేక వసతి.

చిన్నచిన్న వేడుకలకు అనుకూలంగా తయారుచేస్తున్నారు.అనుమతుల విషయంలో: క్రూజ్‌లను దేశీయ జలమార్గాల్లోని ఆయా రాష్ట్రాల పరిధిలో నడిపేటప్పుడు సంబంధిత చట్టాలను అనుసరించాల్సి ఉంటుంది. ఎక్సైజ్, తీర ప్రాంత అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. గతంలో ఓ నౌక విశాఖ నుంచి చెన్నై వెళ్తుండగా కొన్ని అనుమతులు లేకపోవడంతో మధ్యలోనే పుదుచ్చేరి వద్ద నిలిపేశారు. ఇటీవల దక్షిణ భారతదేశ పర్యాటక మంత్రుల సదస్సులో ఈ అంశంపై చర్చించడంతో ఆ రాష్ట్రం నుంచి కొంత సానుకూలత వచ్చింది.

# జైలులో దస్తగిరికి బెదిరింపులు

## విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

వైఎస్ వివేకా నంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరిని కడప జైలులో బెదిరించటం, ప్రలోభపెట్టిన ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్‌ను నియమించింది. శుక్రవారం ఉదయం కడప జైలులో దస్తగిరిని విచారణ అధికారి ప్రశ్నించనున్నారు. అనంతరం చైతన్యరెడ్డి, ప్రకాశ్‌రెడ్డిని విచారణకు పిలవనున్నారు. శుక్రవారం, శనివారం కడప జైలులో ఈ విచారణ కొనసాగనుంది. దస్తగిరి ఫిర్యాదుతో ఇప్పటికే వివేకా హత్య కేసులో నిందితుడైన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డా.దేవిరెడ్డి చైతన్యరెడ్డితో పాటు కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఐఎన్ఎస్ ప్రకాశ్, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్యలపై కేసు నమోదైంది. అక్రమ నిర్బంధం, నేరపూరిత బెదిరింపు, ఉద్దేశపూర్వక దాడి, హాని కలిగించటం, తప్పుడు సాక్ష్యాలివ్వాలని బెదిరించటం తదితర అభియోగాలు వారిపై నమోదయ్యాయి.



# రెండోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఎక్కడుంది?



న్యూఢిల్లీ : ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ వ్యాఖ్యలకు అక్కడికక్కడే కౌంటర్‌లు! ఇదీ... టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటన జరిగిన తీరు! ఆయన మంగళవారం, బుధవారం వరుసగా ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కూటమి సర్కారు వినూత్నంగా తీసుకొచ్చిన 'వాట్సాప్ గవర్నెన్స్'తో డేటా చౌర్యం జరుగుతుందంటూ జగన్ పత్రిక చేసిన ప్రచారంపై విరుచుకుపడ్డారు. డేటా చౌర్యాన్ని నిరూపిస్తే రూ.10 కోట్లు స్వయంగా తానే కానుకగా ఇస్తానని సవాల్ విసిరారు. ఇక... 'జగన్ 2.0... మళ్లీ అధికారంలోకి వస్తాం.. 30 ఏళ్లు నేనే సీఎం' అని బుధవారం జగన్ చేసిన ప్రకటనపై లోకేశ్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ''జగన్ 1.0నే జనం భరించలేకపోయారు. ఇక ఆయన రెండోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఎక్కడుంది? ఆయన హయాంలో మైనారిటీలు, దళితులు, బలహీనవర్గాలు హింసకు గురయ్యారు. అప్పుడు ప్రజలకు స్వేచ్ఛ ఎక్కడ ఉండేది? నాటి పరిస్థితులను ఎప్పటికీ మరిచిపోలేరు'' అని లోకేశ్ పేర్కొన్నారు. జగన్ హయాంలో అక్రమ మద్యం అమ్మకాలు, భూకుంభకోణాలు, అవినీతి కార్యకలాపాలు అనేకం జరిగాయని... వాటిపై చట్టాన్ని అనుసరించి చర్యలు తీసుకుని తీరుతామని లోకేశ్ తెలిపారు. తన రెడ్‌బుక్‌లో ఎన్ని అధ్యాయాలు అమలయ్యాయన్నదీ రహస్యంగా ఉంచుతామని తెలిపారు.

అవన్నీ మరిచిపోయారా?

ఇప్పుడు జగన్ నుంచి పెద్దిరెడ్డి వరకూ స్వేచ్ఛగా తిరుగుతున్నారని... జగన్‌కు జెడ్ ప్లస్ బుల్లెట్ ప్రూఫ్ భద్రతతోపాటు ఎస్కార్ట్‌లు, రోప్‌పార్టీలు ఇస్తున్నామని లోకేశ్ గుర్తు చేశారు. గతంలో జగన్ ఏం చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆయన అన్నారు. చంద్రబాబు ఆత్మకూరుకు బయలుదేరితే గేటుకు తాళం వేశారని, తనపై 23 కేసులు... నేతలు, కార్యకర్తలపై వందలాది కేసులు పెట్టారని చెప్పారు. 'అవన్నీ మరిచిపోయారా? అన్నింటిపై చర్యలుంటాయి' అని స్పష్టం చేశారు. దావ్‌సకు వెళ్లి దారి ఖర్చులు వృథా చేశామని జగన్ అనడంపై లోకేశ్ మండిపడ్డారు. జగన్ గత ఐదేళ్ల పాలనలో ఎన్ని ప్రాజెక్టులు తీసుకొచ్చారో? ఈ 8 నెలలలో తాము ఎన్ని తీసుకొచ్చామో? బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. రాబోయే 12 నెలలలో ఎలాంటి పెట్టుబడులు రాబోతున్నాయో మీరే చూస్తారని ఆయన చెప్పారు. జగన్ హయాంలో 13 లక్షల మంది విద్యార్థులు ఎలా తగ్గిపోయారో బొత్స సత్యనారాయణ జవాబివ్వాలని డిమాండ్ చేశారు.

## కల్చరల్, లిటరరీ సంస్థలకు అవకాశం

కళా సంస్థలు ఏవోక కార్యక్రమాలను చేస్తూనే ఉంటాయి. ఎంతో ఖర్చు చేస్తారు. అంతగా ఖర్చు చేసి చేసే కార్యక్రమాలకు గుర్తింపు అవసరం. గుర్తింపు రావాలంటే మీడియాలో ప్రచారం కావాలి. కళా సంస్థలు, సాహిత్య సంస్థలు తాము నిర్వహించిన కార్యక్రమాల వివరాలను కార్యక్రమం అయిన వెంటనే ఫోటోలతో మా మెయిల్ ఐడి కి పంపండి. 'నేడు' దినపత్రికలో ప్రచురిస్తాం. మెయిల్ ఐడి: nedudailynews@gmail.com.

## రచనలకు ఆహ్వానం

మీ అందరి ఆదరణతో 'నేడు' దినపత్రిక ముందుకు సాగుతోంది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలంటే మీ అందరి సహకారం అవసరం. నేడు దిన పత్రిక రచయితలను, కవులను ప్రోత్సహిస్తుంది. మీరు ఏ రచనలైనా కథ కావచ్చు, కవిత కావచ్చు, వ్యాసం కావచ్చు మాకు పంపండి. దాన్ని పరిశీలించి ఎంపిక చేస్తాం. మీరు మీ రచనను కంపోజ్ చేసి మాకు పంపవచ్చు. మీ రచనలు మెయిల్ ఐడికి పంపండి. nedudailynews@gmail.com

# లావాని పట్టను కూడా వదలని డాక్టర్

* 30 గుంటల లావాని పట్టాలో అక్రమంగా రోడ్డు నిర్మాణం
* సంబంధిత పట్టాదారులకు డబ్బు ఆశ చూపి రోడ్డు నిర్మాణం
* మేడ్చల్ తహసిల్దార్‌కు ఫిర్యాదులు
* లావాని పట్టాలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్న తహసిల్దార్





మేడ్చల్,నేడున్యూస్: ఆయన ఒక పేరు ఉన్న డాక్టర్... కార్పొరేట్ ఆసుపత్రిలో డాక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. మేడ్చల్ జిల్లా రాజ బొల్లారం తండాలోని ప్రభుత్వ భూముల విషయం ప్రస్తావనకు వస్తే చాలు ఈ డాక్టర్ పేరు వినిపిస్తుంది. అతనే డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి. రాజ బొల్లారం తండాలోని 231 సర్వే నెంబర్ లోని 40 కోట్ల విలువగల 7 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని 20 ఏళ్ల పాటు తన కబ్జాలో ఉంచుకొని వార్తల్లోకి ఎక్కారు. ఈ వ్యవహారంపై నేడు దినపత్రిక లో వచ్చిన వరుస కథనాలతో స్పందించిన జిల్లా కలెక్టర్ సూచనల మేరకు మేడ్చల్ తహసిల్దార్ విచారణ జరిపి 7 ఎకరాల 20 గుంటలు ప్రభుత్వ భూమి అని గుర్తించి అందులో ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో 40 కోట్ల విలువ గల 7 ఎకరాల 20 గుంటల స్థలానికి విముక్తి కలిగినట్లు అయింది.అయితే ఘటనను మరువక ముందే డాక్టర్ చంద్రశేఖర రెడ్డి మరో భూ వివాదానికి తెర లేపారు.

**30 గుంటల లావాని పట్టాలో అక్రమంగా రోడ్డు నిర్మాణం**

మేడ్చల్ జిల్లా రాజా బొల్లారం తండాలో సర్వేనెంబర్ 205 లోని 30 గుంటల లావాని పట్టలో అక్రమంగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. రాజ బొల్లారం తండా రోడ్డు నుండి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి కి సంబంధించిన స్థలం వరకు దాదాపు 30 గుంటల లావాని పట్టలో మొరంతో 30 ఫీట్ల వెడల్పుతో రోడ్డును వేశారు. డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి సంబంధించిన స్థలానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో లావాని పట్టాదారులతో చేయి కలిపి అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. లావాని పట్టాలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దన్న నిబంధనలు ఉన్నప్పటికీ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి వాటిని ఉల్లంఘించి అక్రమంగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. లావాని పట్టాదారులకు డబ్బు ఆశ చూపి తన వైపు తిప్పుకొని అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు.


**తహసిల్దార్‌కు ఫిర్యాదులు**

రాజ బొల్లారం తండా లోని 205 సర్వే నెంబర్ లో 30 గుంటల లావాని పట్టాలో అక్రమంగా రోడ్డు వేయడంపై మేడ్చల్ తహసిల్దార్ కు ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుల మేరకు విచారణ జరిపిన తాసిల్దార్ రాకపోకలు సాగకుండా ఉండేందుకు రోడ్డుకు ఇరువైపులా గోతులను తవ్వారు.

**లావాని పట్టాలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు : ఎమ్మార్వో శైలజ**

లావాని పట్టాలు అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ తహసిల్దార్ శైలజ హెచ్చరించారు. 205 సర్వే నెంబర్ లో 30 గుంటల స్థలంలో అక్రమ రోడ్డు నిర్మాణం జరిగిందంటూ నేడు దినపత్రిక ప్రతినిధి మేడ్చల్ తహసిల్దార్ దృష్టి తీసుకెళ్లగా అక్రమ రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా తవ్వకాలు చేపట్టామని తెలిపారు.

## యువకుడి మృతదేహం లభ్యం



మేడ్చల్,నేడున్యూస్: మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్వెల్లిలో నూతన భవనంలో ఓ యువకుడి కుళ్లిపోయిన మృతదేహం లభ్యమైన ది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు అత్వెల్లి గ్రామానికి చెందిన షేక్ దావత్ (22) గా పోలీసులు గుర్తించారు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రూప్ ఇన్సూరెన్స్ డబ్బులు అందజేసిన సొసైటీ చైర్మన్



బయ్యారం,నేడున్యూస్: బయ్యారం మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులుగా సభ్యత్వం కలిగి ఉన్న వారికీ ఇచ్చే గ్రూప్ ఇన్సూరెన్స్ డబ్బులు ఇటీవల బయ్యారం గ్రామపంచాయతీ చెందిన కుంజ రాజబాబు మరణించడంతో వారికి ఇచ్చే గ్రూప్ ఇన్సూరెన్స్ డబ్బులు 50 వేల రూపాయలను బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి చేతుల మీదుగా కుంజా రాజబాబు భార్య కుంజ బాయమ్మ కి బయ్యారం ప్రాథమిక సహకార సంఘ కార్యాలయ ఆవరణంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ వేల్పుల శ్రీనివాస్, బయ్యారం సహకార సంఘ సీఈఓ అనూష,సంఘ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## అనన్య యాడ్స్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

*మాజీ వార్డు సభ్యుడు శివ యాదవ్




మేడ్చల్,నేడున్యూస్: మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా అనన్య యాడ్స్ ఏజెన్సీ ఏర్పాటు చేసిన బోర్డ్ లను తొలగించాలని మాజీ వార్డు సభ్యుడు శివ యాదవ్ డిమాండ్ చేశారు.గుండ్ల పోచంపల్లి కమిషినర్ స్వామి నాయక్ వెంటనే స్పందించి బోర్డ్ లను తొలంగించేలా చర్యలు తోసుకోవలని ఆయన అన్నారు. అనుమతుల కాలం చెల్లినప్పటికీ పలు యాడ్ ఏజెన్సీలు ఇష్టానుసారంగా మున్సిపాలిటీ పరిధిలో కొన్ని సంస్థలను ప్రమోట్ చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడమేంటని ప్రశ్నించారు. యాడ్ ఏజెన్సీలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

## భాజపా జిల్లా అధ్యక్షున్ని ఘనంగా సన్మానించిన జర్నలిస్టులు



కొల్చారం,నేడున్యూస్ : మెదక్ జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన వాల్దాసు మల్లేష్ గౌడ్ ను గురువారం నాడు నర్సాపూర్ స్వగృహం లో జిల్లా ప్రతినిధులు, మండల జర్నలిస్టులు కలిసి అయన ను శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా నూతన అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాల పట్ల ఎప్పటికప్పుడు నిరసనలు తెలియజేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్తారని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో గ్రామ గ్రామాన బీజేపీ అధిపత్యం కనబరుస్తామని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష పదవుల ఎంపికకు కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్, మెదక్ ఎంపీ రఘునందన్ రావుల సహకారం మరువలేని తెలిపారు. నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టిన భారతీయ జనతా పార్టీ అధిష్టానంకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. అధ్యక్షుని కలిసిన వారిలో జిల్లా ప్రతినిధులు రామకృష్ణ గౌడ్ నాగభూషణం మండల జర్నలిస్టులు అశోక్ గౌడ్, శ్రీధర్, లక్ష్మీనారాయణ గౌడ్, శివకుమార్, నర్సిములు రాజు,నవీన్ ,వంశీ, మండల బీజేపీ అధ్యక్షులు పంతులు హరీష్,లింగం తదితరులు ఉన్నారు.

## సాగర సంగం నూతన అధ్యక్షులుగా సూరం ప్రభాకర్ సాగర్

వనపర్తి,నేడున్యూస్: వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం నూతన సాగర సంగం (ఉప్పరి) అధ్యక్షులుగా సూరం ప్రభాకర్ ను ఒకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ సాగర సంగం అధ్యక్షులు రాధాకృష్ణ తెలిపారు. సాగర సంగం ఉపాధ్యక్షులుగా కె.విష్ణు సాగర్ ఈ సందర్భంగా నూతన సాగర సంగం అధ్యక్షులు సూరం ప్రభాకర్ మాట్లాడుతూ ఏకగ్రీవంగా నూతన అధ్యక్షులు సహకార సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు సంఘానికి అందుబాటులో ఉండే సేవలు అందిస్తామని అన్నారు. సంఘం సభ్యులు అందరూ సహకరిస్తే సంఘానికి అభివృద్ధి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సహకార సంఘం అధ్యక్షులు రాధాకృష్ణ సాగర్, ఆవుల రాజు, సూరం శ్రీనివాసులు, షోరూం గోపాల్, లోకేష్, కడుకుంట్ల రవి, సూరం గోవర్ధన్, కడుకుంట్ల శేఖర్, గడ్డపార సత్యనారాయణ, మాడల్ ప్రవీణ్ సాగర్, బంజర బాలరాజ్, కాసాని శివ సాగర్, మొత్కల విష్ణుసాగర్, సూరం జానకి రాములు,బంజర రవి, రాకేష్, ఎమ్మెస్ బాబు, సాయి కిరణ్, సాగర మన్యంకొండ, రామ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో కాంగ్రెస్ సంబరాలు

* కుల గణన సర్వే విజయవంతమైన సందర్భంగా బాణాసంచా పేల్చి సంబరాలు





మేడ్చల్,నేడున్యూస్: బీసీ కుల గణన ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించిన సందర్భంగా మేడ్చల్ లో కాంగ్రెస్ నేతలు సంబరాలు జరుపుకున్నారు.మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోమారం రమణా రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బాణా సంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గోమారం రమణా రెడ్డిలు మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బలహీన వర్గాలు,మైనారిటీల ఆకాంక్షలకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికతో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి రాజకీయ, కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) సర్వేను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణన ఎస్ సి వర్గీకరణ బిల్లులు ఆమోదించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ కే దక్కిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి సి సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్,మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కురుమ,మేడ్చల్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్లు జాకట దేవరాజ్,కౌడే మహేష్ కురుమ, డబిల్ పూర్ గ్రామ మాజీ సర్పంచ్ సంజీవ రావు,సోమారం గ్రామ మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుర్గం వెంకటేష్ ముదిరాజ్,రాజశేఖర్ రెడ్డి నడికొప్పు రంజిత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కే.శ్రీనివాస్‌ను సత్కరించిన భాజపా నాయకులు



కీసర,నేడున్యూస్: భాజపా జిల్లా సీనియర్ నాయకులు ఠాకూర్ విక్రమ్ సింగ్ కీసర పోలీస్ స్టేషన్ లో నూతనంగా ఎస్ హెచ్ ఓ గా బాధ్యతలు స్వీకరించిన సిఐ కే శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాభినందనలు తెలిపారు. విక్రమ్ సింగ్ మాట్లాడుతూ మండలంలో జరిగే నేరాలను అదుపు చేయాలని సి ఐ శ్రీనివాస్ కు మనవి చేశారు. భద్రత భరోసా కల్పించాలని పోలీసు శాఖ అంటే శ్రీరామరక్ష లాగా ఉండాలని కోరారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం 24గం లు అందుబాటులోనే ఉంటానని. ఏదైనా సమస్య వస్తే, అవసరమైతే అర్ధరాత్రి కూడా ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ బాజాపా నాయకులు సాయి కృష్ణ చారి, ఆరూల్, వెంకట సాయి, నారాయణరావు,రామచంద్ర రావు, సీనియర్ నాయకులు టి హరినాథ్ సింగ్, రఘునాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓ మాస్టారూ బడికి రారా!



కారేపల్లి నేడు న్యూస్. సింగరేణి మండలంలోని ఓ గిరిజన కోయ గ్రామంలో విద్యకు అనుకూలమైన వాతావరణాన్ని అందించాల్సిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఓ గిరిజన లంబాడ పండితుడిగా పిలవబడే ఈ ఉపాధ్యాయుడు, పాఠశాలలో తరచుగా గైర్హాజరై, ఉపాధ్యాయ సంఘాల మీటింగ్‌లు, వివాహాలు, శుభకార్యాలు, రాజకీయ సమావేశాల్లో పాల్గొనడం ప్రజల్లో అసంతృప్తిని కలిగిస్తోంది.

**విద్యలో నిర్లక్ష్యం — విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డుకట్ట**

ఈ మారుమూల గ్రామ ప్రజలు పొద్దున్నే పొలాల్లో పని చేసేందుకు వెళ్లిపోతారు. వారు పిల్లలను పాఠశాలకు పంపించినా, అక్కడ ఉపాధ్యాయులు నిజంగా బోధిస్తున్నారా లేదా అన్నది చెక్ చేసే వీలు లేకుండా పోతుంది. అయితే, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పాఠాలు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు తరచుగా పాఠశాలకు డుమ్మా కొట్టడం, తన హాజరు నమోదు చేసుకుని క్షణాల్లో అదృశ్యం కావడం ఇప్పుడు స్పష్టమైంది.

**మీటింగ్‌లు ముఖ్యమా? మాస్టారి బాధ్యత ముఖ్యమా?**

ఉపాధ్యాయ సంఘాల మీటింగ్‌లు జరుగుతాయి, వాటిలో ఉపాధ్యాయుల హాజరు తప్పు కాదు. కానీ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత వరకు న్యాయం? అసలు ఉపాధ్యాయుడిగా ప్రభుత్వం కట్టబెట్టిన బాధ్యతను పక్కన పెట్టి కుల సంఘాల సమావేశాలు, రాజకీయ కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనడం విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కాదా?

**ప్రభుత్వ పాఠశాలల పతనానికి కారణమివే!**

ఈ తరహా నిర్లక్ష్యం వల్లే ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయి. లక్షలు ఖర్చుచేసి నిర్మించిన పాఠశాలల్లో పిల్లల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందిన తల్లిదండ్రులు భారీ మొత్తంలో ఖర్చు పెట్టి పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపే పరిస్థితి ఏర్పడింది. పైగా, విద్యార్థుల సంఖ్య తగ్గితే ప్రభుత్వ పాఠశాలలు మూత పడే పరిస్థితి వస్తోంది.

**ఎంఈఓ గారి దృష్టికి...**

ఇలాంటి సమస్యలు సింగరేణి మండలంలో ఒకే చోట పరిమితం కాదు. పలు మారుమూల గ్రామాల్లో ఇలాంటి నిర్లక్ష్యం వెలుగుచూస్తోంది. జిల్లా విద్యాధికారులు దీనిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవల ప్రభుత్వ పాఠశాలలపై ఎంఈఓల సడెన్ ఇన్‌స్పెక్షన్‌లు జరగడం తగ్గిన నేపథ్యంలో, ఇలాంటి ఉపాధ్యాయుల నిర్లక్ష్య ధోరణి పెరుగుతోంది.

**ఇకనైనా చర్యలు తీసుకోవాలి!**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలంటే, ఇలాంటి నిర్లక్ష్యపు ఉపాధ్యాయులపై ఎంఈఓలు మరియు సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించాలి. విద్యార్థుల హాజరు పెంచడమే కాకుండా, ఉపాధ్యాయుల బోధనను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

సింగరేణి మండల ప్రజలు ఈ అంశంపై స్పష్టమైన స్పం దన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించా ల్సిన ఉపాధ్యాయులే రాజకీయాల్లో మక్కువ చూపితే, రేపటి తరం భవిష్యత్తు ఏమవుతుంది? అనే ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశమైంది.సింగరేణి ఎంఈఓ తగిన చర్యలు తీసుకుని, విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలి – ఇదే ప్రజల విజ్ఞప్తి.

## పేదింటి ఆడబిడ్డకు పుస్తె మట్టెల బహుకరణ



కొల్చారం,నేడు న్యూస్: పేదింటి ఆడ బిడ్డల పెళ్లిళ్లకు తన వంతు సహకారం చేస్తున్న మనసున్న మారాజు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ్ రెడ్డి రఘువీరా రెడ్డి గురువారం మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని సీతారాం తాండ లో కరంతోట్ సునీత భాయ్ లాల్ సింగ్ కుమార్తె వివాహానికి తనవంతుగా పుస్తెమెట్టలను బహుకరించారు. ఈ పుస్తె మట్టలను భాజపా మండల నాయకుల ఆధ్వర్యంలో అందజేశారు రామ్ రెడ్డి రఘువీరారెడ్డి నర్సాపూర్ నియోజకవర్గంలో పేదింటి ఆడపడుచుల వివాహాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు ఘనపూర్ పంతులు హరీష్ , గిరజన మోర్చా అధ్యక్షులు పూల్ సింగ్ , సీతారం తండ బూత్ అధ్యక్షులు అంజి నాయక్, బిజెపి నాయకులు మంగలి లింగం , సంతోష్ , శివలల్, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ ఎరువుల కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

* మండల వ్యవసాయ అధికారిపై ఆగ్రహం

కొల్చారం,నేడున్యూస్: మండల కేంద్రమైన కొల్చారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల కేంద్రాన్ని గురువారం నాడు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు ఎరువుల విక్రయం రిజిస్టర్లు ఎంత విక్రయించింది నమోదు చేయలేదని మీరు ఏం చేస్తున్నారని మండల వ్యవసాయ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు అనంతరం పంట పొలాలను పరిశీలించారు అనంతరం వసురంతాండ లో ప్యాడి బుకింగ్ పరిశీలన రైతులకు సంబంధించిన డిజిటల్ యాప్ సర్వే లోపాలపై ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించారు అనంతరం కొల్చారం పశు వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు.



# డంపు యార్డు ఏర్పాటు వెంటనే విరమించుకోవాలి

*భాజపా జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్




కొల్చారం,నేడు న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి మెదక్ జిల్లా నల్లవల్లి అటవీ ప్రాంతంలో 150ఎకరాలలో డంపు యార్డు ఏర్పాటు ఆలోచనను వెంటనే విరమించుకోకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టనున్నట్లు భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు. మెదక్ జిల్లా కొల్చారంలో బిజెపి మండల శాఖ అధ్యక్షులు గణపురం పంతులు హరీష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన గురువారం మాట్లాడుతూ నర్సాపూర్ ప్రాంత ప్రజలు ఇప్పటికే ఇరువైపులా బోరపట్ల, బొంతపల్లి పారిశ్రామికవాడల వాయు జల కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారని అలాంటి నర్సాపూర్ ప్రాంతంలో ని పచ్చని అటవీ ప్రాంతమైన నల్లవెల్లి ప్రాంతంలో 150 ఎకరాలలో డంపు యార్డు ఏర్పాటు చేయడం వల్ల నర్సాపూర్ ప్రాంత ప్రజలు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున వెంటనే ప్రభుత్వం డంప్ యార్డ్ ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలన్నారు. హైదరాబాదులోనే అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వేస్టేజ్ డిస్పోజబుల్ యంత్రాలను ఏర్పాటు చేసి అక్కడి చెత్తను అక్కడే నిర్వీర్యం చేయాలని అన్నారు. హైదరాబాద్ చెత్తనుతీసుకొచ్చి ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల నెత్తిన రుద్దుతామనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే భాజపా తరపున ఉద్యమం తీవ్రతరం చేసి డంపియాడు ఏర్పాటు పనులు అడ్డుకుంటామన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి డంపు యార్డ్ ఏర్పాటు పనులు అడ్డుకుంటామని అవసరమైతే ఈ అంశాన్ని పార్లమెంట్లో రఘునందన్ రావు లేవనెత్తి పచ్చని అటవీ ప్రాంత దుర్గంధంతో ఎడారిగా మారకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు మంగలి లింగం, గిరిజన మోర్చా అధ్యక్షులు పూల్ సింగ్, అంజి నాయక్, శివలల్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల, బాలికల భద్రతకు భరోసా పెద్దపీట

***వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**
***మహిళలు, పిల్లలు మౌనం వీడి, నిర్భయంగా ముందుకు రండి, వేధింపుల నుండి బయటపడండి**
***భరోసా ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో భరోసా సిబ్బంది సేవలను కొనియాడిన జిల్లా ఎస్పీ**
***వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**



**వనపర్తి,నేడున్యూస్:** భరోసా కేంద్రం ద్వారా మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు వారికి అవసరమైన న్యాయం కల్పించడం జరుగుతుందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అన్నారు. అత్యాచార బాధితులకు, వైద్య,న్యాయ, సైకాలజికల్ సపోర్టు, వంటి సేవలు ఒకే గొడుగు కింద అందిస్తున్న పోలీస్ శాఖ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో నడుపుతూ సేవలందించి, జిల్లా ప్రజల మన్ననలు పొందిన వనపర్తి జిల్లాలో భరోసా కేంద్రం ప్రారంభమైన తేది: ఫిబ్రవరి 06, 2024 నుండి ఒక సంవత్సరం ఇప్పటి వరకు విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా భరోసా కేంద్రం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధితులుగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లాఎస్పీ రావుల గిరిధర్, జిల్లా అదనపు కలెక్టర్ సంజిత్ గంగ్వార్ సంబంధిత అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలను దృష్టిలో ఉంచుకొని, అన్ని రకాల సేవలను ఒకే గొడుగు క్రింద అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా వనపర్తి జిల్లాలో భరోసా కేంద్రాన్ని ఫిబ్రవరి 06, 2024 నాడు ప్రారంభించడం జరిగిందన్నారు. భరోసా సెంటర్ నందు శిక్షణ పొందిన సిబ్బంది, భాదిత మహిళలను అక్కున చేర్చుకొని వారిలో కొండత ధైర్యాన్ని నింపుతూ సమస్యలతో భరోసా సెంటర్ కు వచ్చిన వారికి నిష్ణాతులైన కౌన్సర్ లచే కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, పోక్సో, అత్యాచార కేసుల్లో భాదిత మహిళలకు అన్ని రకాల సేవలు (మెడికల్, లీగల్, కాంపెన్సేషన్) ఒకే వేదికగా అందిస్తూ, భాదితులకు బాధ నుండి విముక్తి కల్పిస్తూ సత్వర న్యాయం చేకూరేలా సేవలందిస్తున్న భరోసా సిబ్బంది సేవలను కలెక్టర్ కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా పోక్సో మరియు మహిళల పై అత్యాచార కేసులను నియంత్రించడానికి స్కూల్, కళాశాలలలో తరుచూ అవగాహన (ప్రవేశం అఫ్ చైల్డ్ సెక్సువల్ ఆబుసే) కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. పోక్సో కేసు నమోదు అయినప్పటి నుండి చివరి వరకు బాధితులకు అండగా వుంటూ, నేరస్తులకు శిక్ష పడేలా చేయడమే భరోసా ముఖ్య ఉద్ధేశ్యం అన్నారు. తమకు జరిగిన అన్యాయం గురించి నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు నమోదు చేయాలని, న్యాయస్థానం ముందు దోషులకు శిక్ష పడినప్పుడే తిరిగి నేరం చేయడానికి వెనకడుగు వేస్తారని అన్నారు. భరోసా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి అలసత్వం చూపరాదని, రాత్రి పగలు అని తేడా లేకుండా ఎల్లవేలా పిల్లల, మహిళల రక్షణకు అందుబాటులో ఉండాలని సూచించారు. బాధితులకు ఎలాంటి అసౌకర్యం కలగనీయకుండా అన్ని డిపార్ట్మెంట్ అధికారులతో సమన్వయంతో విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో భరోసా సెంటర్ ప్రారంభమైన నాటి నుండి సత్ ఫలితాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న భరోసా సిబ్బందిని, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, సిడబ్ల్యుసి, సఖీ సెంటర్ తదితర డిపార్ట్మెంట్ అధికారుల సమన్వయంతో భరోసా కేంద్రాలలో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉందని ఎస్పీ తెలిపారు. ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో న్యాయ సలహాలు, వైద్యం, సైకాలజీ తదితర సేవలు అదించడం జరుగుతుందని అన్నారు. నిరాదరణకు గురైన మహిళలు బాలలకు భరోసా కల్పించేందుకు వనపర్తి జిల్లాలో భరోసా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 47కేసులు నమోదు కాగా 37 ఫోక్సో కేసులు ఉన్నాయని అన్నింటికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న 6 మంది బాధిత మహిళలకు 87 వేల 500 వందల రూపాయలు అందించడం జరిగిందనీ. పిల్లలకు 24/7 సేవలు అందిస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ భరోసా బాధితులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ సంజిత్ గగ్వార్, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పి ఉమామహేశ్వరరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి సుధారాణి, వనపర్తి సీఐ కృష్ణ, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, వనపర్తి రూరల్ 2వ ఎస్సై బాలయ్య, ట్రాఫిక్ ఎస్సై సురేందర్, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ శిరీష, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు, భరోసా సిబ్బంది, భరోసా బాధితులు, షీ టీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

**- జిల్లా డిఆర్డివో నాగిరెడ్డి**



**గుండాల, నేడున్యూస్:** గుండాల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను జిల్లా డిఆర్డివో నాగిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం డిఆర్డివో నాగిరెడ్డి మాట్లాడుతూ.. సకాలంలో పనికి రావాలని, పనికి తగ్గ వేతనం కూడా వస్తుందని, కూలీల హాజరు తీసుకొని వారితో ముచ్చటించారు. అనంతరం నర్సరీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్ రావు, ఏపీవో ఇమ్మాన్యుల్, పంచాయతీ కార్యదర్శి సిహెచ్. సోఫియా, టి ఏ మత్స్యగిరి, పల్లవి, ఎఫ్ఎ ఐలయ్య, కారోబార్ శీను, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఏ.ఆర్ ఎస్ ఐ ఆత్మహత్య



**వరంగల్‌బ్యూరో, నేడున్యూస్** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా లో విషాద ఘటన చోటు చేసుకుంది. భద్రాది కొత్తగూడెం జిల్లా బయ్యారంలో ఏ ఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నర్సయ్య గురువారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నరసయ్య భార్య సునీత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవల వల్లనే నర్సయ్య,ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. భార్య సునీత పై చర్యలు తీసుకోవాలని మృతుని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## కాంగ్రెస్‌లో చేరిన గాగులోటు యాకూబ్



**జనగామ బ్యూరో /పాలకుర్తి, నేడున్యూస్ :** పాలకుర్తి నియోజకవర్గం, రాయపర్తి మండలంలోని జింకురాం తండా గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడ గగులోతు యాకుబ్ బి. ఆర్. ఎస్. పార్టీ ని వీడి కాంగ్రెస్ పార్టీ లో చేరారు.గురువారం కార్యాలయంలో...రాయపర్తి మండలం జింకురాం తండాకు చెందిన,బీఆర్ఎస్ పార్టీ,గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు గుగులోతు యాకుబ్ ,కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న, సంక్షేమాలు, మరియు ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో,తొర్రూరు బ్లాక్ అధ్యక్షులు జాటోత్ హమ్య నాయక్*,మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేరడం జరిగింది.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుగులోత్ శ్రీనివాస్ స్టేట్ ఎస్సీ సెల్ కో కన్వీనర్ కందికట్ల రాజయ్య*,మండల ముఖ్య నాయకులు ఐరెడ్డి ఎల్లారెడ్డి,మాలోతు సీతారాం,దేదావత్ రామ* గ్రామ పార్టీ అధ్యక్షులు భూక్య సర్వన్*, పిఏసిఎస్ డైరెక్టర్ మాలోతు దేవేం దర్, బూత్ కన్వీనర్ భూక్య వెంకన్న* మాజీ వార్డు నెంబర్ మాలోత్ రవి,గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు గుగులోతు శ్రీనివాస్, గుగులోతు యాకూబ్,గుగూలోతు నిమ్యా పోతన,గుగులోతు సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల దేవాలయం పార్కింగ్ నియంత్రణ పై శాశ్వత పరిష్కారం

*** పగడ్బందీగా చర్యలు**
*** తీసుకుంటాం కలెక్టర్ రాహుల్ రాజ్**

**కొల్చారం,నేడున్యూస్** గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏడుపాయల దేవాలయం పార్కింగ్ నియంత్రణకు శాశ్వత పరిష్కారం, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జాతర నిర్వహణకు శాఖల వారీగా కార్యచరణ పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడుపాయల వనదుర్గ అమ్మవారి దేవాలయం ఆదివారం రోజు భక్తులు తండోపతండాలుగా అమ్మవారి దర్శనానికి విచ్చేస్తారని పార్కింగ్ నియంత్రణ చాలా కష్టతరమైతున్న తరుణంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు.అనంతరం రానున్న మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయల జాతర నిర్వహణ ఏర్పాట్లపై శాఖల వారీగా నిర్వహించే కార్యక్రమాలపై సమగ్ర కార్యచరణ తయారు చేసి సోమవారం లోగా సమర్పిస్తే అటువంటి నివేదికలను ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్నికలపై అదనపు కలెక్టర్ సమీక్ష



**కారేపల్లి,నేడున్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో, అదనపు కలెక్టర్ శ్రీజ గురువారం ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా, ఎలాంటి అంతరాయాలు లేకుండా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.ఈ క్రమంలో, అదనపు కలెక్టర్ శ్రీజ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికల ముందు రోజు పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సిన ఎన్నికల సిబ్బంది అవసరమైన సామగ్రిని ఇక్కడి నుండి తీసుకోవాల్సి ఉంటుందని, అందువల్ల కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు.

**ఎన్నికల సామగ్రి భద్రతపై ప్రత్యేక దృష్టి**

ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఈ కేంద్రంలో, పోలింగ్ సామగ్రి సరైన రీతిలో భద్రంగా నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులకు వివరించారు. ఎంపీడీవో సురేందర్, తహసీల్దార్ సంపత్ కుమార్‌లతో సమావేశమై, ఎన్నికల సామగ్రి పంపిణీ, భద్రతా ఏర్పాట్లు, అవసరమైన వసతులు వంటి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా, ఆమె మాట్లాడుతూ ఎన్నికల సరఫరా కేంద్రంలో భద్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలి. సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా సామగ్రిని సులభంగా పొందేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. ఎన్నికల రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు తమ బాధ్యతలను పూర్తి సమర్థవంతంగా నిర్వర్తించాలి.ఎన్నికల విజయం కోసం సమన్వయంతో పని చేయాలిఅదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల ప్రణాళికకు అనుగుణంగా పని చేయడంతో పాటు, అత్యధిక ఓటింగ్ నమోదయ్యేలా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, ఎన్నికల రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కార్యకర్తలు, అధికారులకు తగిన సూచనలు అందించాలని ఆమె ఆదేశించారు.ఈ సమీక్షలో సంబంధిత అధికారులు, ఎన్నికల నిర్వహణలో భాగమైన పలువురు అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పారద ర్శకంగా, నిష్పాక్షికంగా, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగిస్తూ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలిసాధారణ ప్రజలు తమ ఓటు హక్కును సమగ్రంగా వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని అధికారులు కోరుతున్నారు. ఓటరు జాబితాలో తమ పేర్లు పరిశీలించుకోవడం, అవసరమైన పత్రాలతో ఎన్నికల కేంద్రాలకు రావడం వంటి విషయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇదే సందేశాన్ని అందరికీ చేరవేసి, ప్రజాస్వామ్య విధానాన్ని మరింత బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారనుంది.

## డ్రింకింగ్ వాటర్ లో డ్రైనేజీ లీకేజీ

***రూ.72 లక్షలు ఖర్చుపెట్టినా తాగునీటికి తిప్పలు.**
*** లీకేజీలు అరికట్టండి.**
*** అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించండి.**
*** ప్రత్యేక అధికారికి బీజేపీ నేతల వినతి.**



**వరంగల్ బ్యూరో, నేడు న్యూస్** హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని దేవునూర్ గ్రామంలో తాగునీటి కోసం రూ.72 లక్షలు ఖర్చుపెట్టినా నేటికీ లీకేజీ అయిన డ్రైనేజీ వాటర్ మాత్రమే సరఫరా అవుతున్నాయని బీ జే పీ నేతలు పేర్కొన్నారు. ఈ విషయమై వెంటనే తగు చర్యలు చేపట్టాలని గ్రామ ప్రత్యేక అధికారి ల్, నాయబ్ తహశీల్దార్ ను గురువారం కలిసి వినతి పత్రం. అందించారు.ఈ సందర్భంగా బీజేపీధర్మసాగర్ మండల ప్రధాన కార్యదర్శి కొంగంటి సందీప్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు సంగెకారి యువరాజు మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్ కు విన్నవించినట్టు పేర్కొన్నారు. దేవునూర్ గ్రామంలో అర్హులకు (ప్రధాన మంత్రి అవాస్ యోజన) ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు.. మిషన్ భగీరథ స్కీం కింద లక్షల రూపాయలు గ్రామ తాగునీటి అవసరాల నిమిత్తం ఖర్చుపెట్టినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు.

## కులగణన పేరుతో బీసీల నెత్తిన బస్మాసుర హస్తం

*** బీసీల సామాజిక, రాజకీయ చైతన్యం పై ఉక్కుపాదం మోపుతున్న కాంగ్రెస్ సర్కార్**



**బోడుప్పల్, నేడు న్యూస్:** రాష్ట్ర శాసనసభ సాక్షిగా బీసీ కుల గణన వివరాలు తెలిపిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ల పట్ల వారి చిత్తశుద్ధి ఏరకంగా ఉందో తెలియజేసిందని బిజెపి రాష్ట్ర నాయకులు సిలువేరు శంకర్ ప్రజాపతి అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం గానీ, గత ప్రభుత్వం 2014 లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం గానీ బీసీల జనాభా 51 శాతం కన్నా ఎక్కువేనని ఆయన తెలిపారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కుల గణన తరువాత కేవలం 56 శాతం అంటే కుల గణన ఎంత అశాస్త్రీయమైన పద్ధతిలో జరిగిందో తెలుస్తుందని ఆయన ఆరోపించారు. బీసీ ల గణనలో ముస్లిం బీసీలు కూడా ఉన్నారని చెప్పడం తీవ్రంగా ఆలోచించవలసిన విషయమని, బీసీ కుల గణన పేరుతో బీసీ ల జనాభా గణనీయంగా తగ్గిందని, ఓసీ ల జనాభా పెరిగిందని వెల్లడించడం కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. సమగ్ర బీసీ ల లెక్కలే ఇంత దారుణంగా వెల్లడించిన వారు రేపు కులాల వారీగా వెల్లడించే లెక్కలు కూడా తప్పుల తడకగానే వెల్లడిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ తమ వైఖరి ఖచ్చితంగా చెప్పకుండా డొంకతిరుగుడుగా వ్యవహరిస్తోందన్నారు. ప్రకించించిన ప్రతి హామీని నెరవేర్చకపోగా బీసీ, ఎస్సి, ఎస్టి, ఓసీ, మైనారిటీ పేర్లతో వివాదాలకు తెరదీసి ప్రజలను అయోమయంలో పడేస్తున్నారని వివరించారు. మంత్రి పదవులు మొదలుకొని కమీషన్ల చైర్మన్ల పదవులదాకా బీసీల పట్ల వివక్ష చూపి కాంగ్రెస్ కపట ప్రేమను నటిస్తుందని, ఆరు గ్యారెంటీల అమలులో గోరంగా విఫలమైన కాంగ్రెస్, రాష్ట్ర ప్రజలను అయోమయంలోకి నెట్టిందన్నారు. రాజకీయంగా ఎన్ని ఎత్తుగడలేసినా, ఎన్ని అవాంతరాలు సృష్టించినా రాష్ట్రంలో ఉన్న బీసీ లు తమ కులాల ఆత్మగౌరవం కోసం, సామాజిక తెలంగాణ కోసం, రాజకీయ క్షేత్రంలో తమ వాటా కోసం, ప్రాతినిధ్యం కోసం పోరాటం చేస్తూనే తగిన గుణపాఠం నేర్పిస్తారని ఆయన హెచ్చరించారు.

## జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధాని వరకు నాలుగు లైన్ ల రోడ్లు

*** మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాల వరకు డబుల్ లైన్ రోడ్డు**
*** రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించాలి.**
*** రోడ్లు & భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్.**



**జనగామ బ్యూరో, నేడు న్యూస్ :** జిల్లా కేంద్రాలనుండి రాష్ట్ర రాజధానికి నాలుగు లైన్ల రోడ్డు, మండల కేంద్రాలనుండి జిల్లా కేంద్రాలా వరకు డబుల్ రోడ్ల ను ఏర్పాటు చేసేందుకు తగిన ప్రతపాధనలను సమర్పించాలని రోడ్లు &భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశించారు. ఈ విషయమై అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జనగామ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ రిజ్వాన్ ఫాష షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్లు &భవనాల ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ.. ప్రతి జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర రాజధాని వరకు నాలుగు లైన్ల రోడ్లు, మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రం వరకు డబ్బులు రోడ్లు ఏర్పాటుకు, రోడ్ల విస్తరణకు తగిన ప్రతిపధనలను పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే జిల్లా స్థాయిలో ఈ రోడ్ల విస్తరణ పనులకు కలెక్టర్ చైర్మెంగా ఉంటారని, రోడ్లు నిర్మాణ ఏజెన్సీ నుండి ఒకరు , ఈ ఈ ఒకరు ఈ కమిటీ లో సభ్యులుగా ఉంటారని తెలిపారు.

## ఆర్టీఐ కమిషనర్‌లను నియమించాలి




**- సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం**
**- తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోపీనాథ్ కట్టెకోల ఏకగ్రీవంగా ఎన్నిక**

**హైదరాబాద్, నేడున్యూస్:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోపీనాథ్ కట్టెకోల నియమితులయ్యారు. ఈ మేరకు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్‌టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలుకోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతోపాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతి నుండి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గోపీనాథ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెన్నెముక అయిన సమాచార హక్కు చట్టం 2005 కు సంబందించిన 4 (1) బి సంబంధించిన 17 అంశాల సమాచారం, రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 న గల కాపీలను ఉచితంగా, స్వచ్ఛందంగా ప్రజలకు కోరినప్పుడు అధికారులు ఇవ్వాలని అన్నారు. మూడో వ్యక్తి సమాచారం విషయంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే సమాచారం అయితే సెక్షన్ 11 (1) ప్రకారంగా దరఖాస్తుదారునికి అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇవ్వని అధికారులకు కనిష్టంగా 250 నుండి గరిష్టంగా 25 వేల వరకు జరిమానాలు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ విధిస్తారు అని అన్నారు.సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సిబిఐ, సిఐడి, కోర్టు జడ్జిమెంట్, దేశ భద్రత సమాచారం, పోలీస్ స్టేషన్ భద్రత, ఆయుధాల సమాచారాన్ని మినహాయించబడిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి దీపక్ కులకర్ణి,పందుల రాజు గౌడ్, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న జాబ్ మేళ

**మేడ్చల్.నేడున్యూస్ :** ఈనెల 10న మేడ్చల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరగనుంది. ఉదయం 10:30 గంటల నుండి ఈ జాబ్ మేళ ప్రారంభమవుతుందని, ఇందులో అపోలో ఫార్మసీ నవత రోడ్డు ట్రాన్స్ పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, జియో టెక్నాలజీ, జీవీకే - కైరోస్, సిపేట్ చర్లపల్లి ( శిక్షణ& ఉపాధి) నిర్మాణ్ ( శిక్షణ & ఉపాధి) ట్రేడ్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీల ప్రతినిధులు హాజరై వారి కంపెనీలలో ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారు. 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు యువకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు కోరారు.

## బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు ప్రారంభం

* కార్యకర్తలకు నాయకుల భూస్టు



**జనగామ బ్యూరో, నేడు న్యూస్:** జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు.. క్లస్టర్ ఇంచార్జిలు మాజీ కౌన్సిలర్ గజ్జెల నర్సిరెడ్డి , వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడాల రాజు, తెరాస నాయకులు తిప్పారపు విజయ్, దామెర రాజు దుబ్బాక వీరస్వామి గురువారం బచ్చన్నపేట మండలం లక్ష్మిపురం గ్రామం లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలతో సన్నహక సమావేశాల ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా సమావేశం లో మాట్లాడుతూ ప్రతి కార్యకర్త బి ఆర్ ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి...ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ లను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు...రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

## పశు వైద్యశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కొల్చారం.నేడున్యూస్:** గురువారం కుల్చారం మండలం పశువైద్యశాలను కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా పరిశీలించారు. పశు వైద్యశాలలో సిబ్బంది హాజరు పట్టిక, పశువుల వ్యాధి నిరోధక టీకాలు, మందుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించి వ్యాధుల బారి నుండి రక్షించాలని అన్నారు. అధికారులు సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులు, దివాంగులు సహాయ ఉపకారణాలకు లబ్ది దారుల ఎంపిక

**జనగామ బ్యూరో, నేడున్యూస్ :** జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఆలింకో, హైదరాబాద్ వారి సహకారంతో దివ్యాంగులకు & వయోవృద్ధులకు నేడు రూమ్ నెంబర్ 6, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు సహాయ ఉపకరణముల ఎంపిక శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ ఎంపిక శిబిరానికి జనగాం రూరల్ & మునిసిపాల్టీ, లింగాలఘనపూర్, తరిగొప్పుల, నర్మెట, బచ్చన్నపేట మండలాల దివ్యాంగులు & వయోవృద్ధులు మొత్తం 80కి పైగా సహాయ ఉపకరణములు ఎంపిక శిబిరంలో దరఖాస్తు చేసుకోవడం జరిగిందని జిల్లా సంక్షేమధికారి గురువారం తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాల నుంచి 230కి పైగా సహాయ ఉపకరణములు ఎంపిక శిబిరంలో దరఖాస్తు చేసుకోవడం జరిగిందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, ఆలింకో కంపెనీ అధికారులు రష్మీ రంజన్ శెట్టి, రాజబాబు, అభిషేక్, అఖిలేష్, సిడిపిఓ రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ సంపత్ కుమార్, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రాజు, సదానందం, సుధాకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో .

## స్థానిక సమరంలో గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యాచరణలు.

**జనగామ బ్యూరో, నేడు న్యూస్ :**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జనగామ నియోజకవర్గ శాసనసభ్యులు డా,, పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ రోజు జనగామ టౌన్ నాయకులు బండ యాదగిరి రెడ్డి ఇంచార్జిగా కన్నెబోయిన గూడెం, బొమ్మకూర్ గ్రామాల్లో బి. ఆర్. ఎస్. పార్టీ నాయకులతో కార్యకర్తలతో సమావేశమై గ్రామాల్లో పార్టీ పరిస్థితి ఏ విదంగా ఉంది, ఎన్నికల్లో ఎలా గెలవాలి అనే విషయాలపై మరియు కార్యకర్తల ఉద్దేశాన్ని కూడా అందరితో చర్చించి అభిప్రాయాలను తెలుసుకున్నారు.రానున్న ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్ళాలో తెలియజేస్తూ, ఈ కార్యక్రమంలో నా దృష్టికి వచ్చిన ప్రతి విషయాన్ని ఏం. ఎల్. ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సమరం లో అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడై పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ నాయక్, తాజా మాజీ జడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్ నాయక్, బి. ఆర్. ఎస్. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంతి రాజలింగం,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, గ్రామశాఖ అధ్యక్షులు ఉచ్చేంతుల లక్ష్మీనారాయణ, పండుగ మల్లేష్ పార్టీ నాయకులు- కార్యకర్తలు పాల్గొన్నారు.



# 90 మంది విద్యార్థులకు ఒక టీచరే

* ఆ టీచర్ కూడా డిప్యూటేషన్ నే
* చదువులు ఎట్లా సాగేది?
* మాకు టీచర్లనివ్వండి అంటూ జిల్లా కలెక్టర్‌కు విద్యార్థుల వినతి
* రాజ బొల్లారం ప్రాథమిక పాఠశాల దుస్థితి పై నేడు పత్రిక ప్రచురించిన కథనంపై డిప్యూటేషన్ పై ఒక టీచర్ కేటాయింపు



**మేడ్చల్ నేడున్యూస్:** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ కృషి చేస్తుంటే మేడ్చల్ జిల్లాలో మాత్రం ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉంది. విద్యార్థులు ఉన్నచోట ఉపాధ్యాయులు లేరు.. ఉపాధ్యాయులు ఉన్నచోట విద్యార్థులు లేరు. విద్యార్థులు లేని పాఠశాలలలో ఉన్న ఉపాధ్యాయులను విద్యార్థులు ఉన్న పాఠశాలల కు సర్దుబాటు చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలం అవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### 90 మంది విద్యార్థులకు ఒకరే టీచర్

మేడ్చల్ మండలం రాజ బొల్లారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉన్నారు. టీచర్ మాత్రం ఒకరే ఉన్నారు. ఆ పోస్ట్ కూడా డిప్యూటేషన్ పై పనిచేస్తున్నారు. రాజ బొల్లారం ప్రాథమిక పాఠశాల దుస్థితిపై నేడు దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన విద్యాశాఖ అధికారులు ఒక టీచర్ ను కేటాయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఒక టీచర్ ఎన్ని తరగతులు చెప్పగలుగుతాడు అనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. విద్యార్థులు అందర్నీ ఒక దగ్గర కూర్చోబెట్టి చదువు చెప్పే పరిస్థితి నెలకొంది. వేరు వేరు తరగతులకు చెందిన విద్యార్థులకు విద్యను ఎలా అందిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలో చదివించే స్తోమత లేకపోవడం వల్లే ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నామని.. తీరా ఇక్కడ 90 మంది విద్యార్థులలో ఒకచోట కూర్చోబెట్టి చదువు చెపితే ఎలా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

### 90 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉండాలి

విద్య హక్కు చట్టం ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. దీనిని బట్టి రాజా బొల్లారం ప్రాథమిక పాఠశాలలో ఉన్న 90 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్ పోస్టులను కేటాయించాలి. గత సంవత్సరం ఈ పాఠశాలకు రెండు పోస్టులు ఉండగా ఈ సంవత్సరము ఒక్క పోస్టుకు కుదించారు. ఆ ఒక్క టీచర్ కూడా ఒకరోజు స్కూలుకు వచ్చి మరసటి రోజు నుండి సిక్ లీవ్ లోకి వెళ్లిపోయారు. దీం తో ఆ పాఠశాలకు ఉపాధ్యాయులు లేకుండా పోవడంతో ఇంతకాలం ఆ గ్రామస్తులు విద్యా వాలంటరీని పెట్టుకుని నడిపించారు. అంతేకాకుండా విద్యార్థుల పరిస్థితిని చూసి ఏఎన్ఎం ప్రతిరోజు పాఠశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు.

అయితే పాఠశాలలో నెలకొన్న దుస్థితిపై నేడు దినపత్రిక ఆ స్కూలుకు ఏఎన్ఎం యే దిక్కు అంటూ కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన విద్యాశాఖ అధికా రులు డిప్యూటేషన్ పై ఓ ఉపాధ్యాయుని పాఠశాలకు పంపిం చింది. ఒక ఉపాధ్యాయులతో 90 మంది విద్యార్థులకు విద్యా బోధన ఎలా సాగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యా హక్కు చట్ట ప్రకారం 90 మంది ఉన్న ఈ పాఠశాలకు మరో ఇద్దరు టీచర్లను కేటాయించాలని డీఈవో తోపాటు జిల్లా కలెక్టర్ ను విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ప్రభుత్వం విద్యార్థులకు కల్పించే అన్ని సౌకర్యాలను ప్రతి విద్యార్థికి చేరేలా చూడాలి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ ఫాషా షేక్.**



**జనగామ బ్యూరో, నేడు న్యూస్ :** చిల్పూర్ మండలం రాజవరం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను గురువారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు స్టాక్ రిజిస్టర్ ల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు వసతి సౌకర్యాలను పెంపొందించేందుకు నిర్మించిన గదులను వినియోగించుకోవాలని కెజిబివి ప్రత్యేక అధికారి ప్రశాంతికి తెలిపారు.పాఠశాల మరమ్మతుల పనులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గదుల కిటికీలు, తలుపుల పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.వంటగదిని పరిశీలించి విద్యార్థుల భోజనం కొరకు వినియోగిస్తున్న కూరగాయలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల సమయం సమీపించినందున విద్యార్థులు అందరూ హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. గణితం పై పట్టు సాధించేందుకు స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. 100 శాతం ఫలితాలు సాధించాలన్నారు. వైద్య సౌకర్యాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకుంటూ సమయానికి ఆహారం, నిద్ర అవసరమని అప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు. తద్వారా విద్యపై ఆసక్తి పెరుగుతుందన్నారు.ఇతర వసతులపై కలెక్టర్ ఆరా తీయగా త్రాగునీటికి, వినియోగానికి నీరు సరిపోవట్లేదని క్రీడా వస్తువులు సరిపోను లేవని, డిజిటల్ తరగతుల ఎక్విప్మెంట్ రిపేర్ చేయించాలని కలెక్టర్ దృష్టికి తేగా వేసవి దృష్ట్యా బోర్ లో భూగర్భ జలాలు అడుగంటినందున నీరు తక్కువగా వస్తున్నదని స్పెషల్ ఆఫీసర్ వివరించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటివినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం చిల్పూర్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి రికార్డుల నిర్వాణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధరణి పెండెన్సీ , ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు, ధ్రువీకరణ పత్రంల జారి పై అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ వెంట ఆర్డీవో డిఎస్ వెంకన్న, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, ఎంపీడీవో వెంకన్న, తాసిల్దార్ సరస్వతి, డిటి రామారావు కేజీబీవీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందించే సేవలు విస్తృత పరచాలి



* నాణ్యమైన ఎరువులు పురుగు మందులు అందుబాటులో ఉంచుకోవాలి
* డిజిటల్ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి

**కొల్చారం,నేడున్యూస్:** కుల్చారం మండలం లో కలెక్టర్ విస్తృత పర్యటన, మండల కేంద్రమైన కొల్చారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఎరువులు పురుగుమందుల గోడౌన్ పరిశీలన, క్షేత్రస్థాయిలో డిజిటల్ క్రాప్ బుకింగ్ తీరును వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.ప్రాథమిక సహకార సంఘం ద్వారా రైతులకు అందించే సేవలు విస్తృతపరచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా కుల్చారం మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి ప్రాథమిక సహకార సంఘం ఎరువుల గోడౌన్ ని తనిఖీ చేశారు. ఎరువులు నాణ్యత, పంట విస్తీర్ణానికి అనుగుణంగా రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచుకోవడం సంబంధిత వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు.అనంతరం వసురం తండా కు సంబంధించి రైతుల పొలాలకు నేరుగా కలెక్టర్ వెళ్లి మండల వ్యవసాయ అధికారుల ద్వారా డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట సర్వే జిల్లాలో పగడ్బందీగా అమలు జరుగుతుందని, పంట డిజిటల్ సర్వేలో ద్వారా, పంటల విస్తీర్ణం, పంట దిగుబడి, పంట నష్టం,సంబంధించిన సమగ్ర వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.ఈ సర్వే ద్వారా పంటల ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. దీని కనుగుణంగా పంటలకు సంబంధించిన అవసరాలను గుర్తించవచ్చు అని పేర్కొన్నారు పంటల సర్వే ద్వారా . పంటల సాగుకు సంబంధించిన వివరాలను సేకరించి అంచనా వేయడంలో మండల వ్యవసాయ అధికారులు వారి పనిలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ సంబంధిత మండల వ్యవసాయ అధికారులు ఏవో శ్వేత కుమారి , ఏఈఓ పిఎసిఎస్ చైర్మన్ నాగూరు మనోహర్ సీఈవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# క్రైమ్ పీసీ సుధాకర్‌రెడ్డి అరెస్ట్

* ఓ కేసు కోసం పోలీస్ స్టేషన్ కు వచ్చిన మహిళపై పలు మార్లు అత్యాచారం
* హత్యాయత్నం
* బాధితురాలు ఫిర్యాదు మేరకు పిసి సుధాకర్ రెడ్డి పై కేసు నమోదు
* రిమాండ్ కు తరలింపు





**మేడ్చల్ బ్యూరో,నేడున్యూస్:** ఓ కేసు నిమిత్తం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళను మేడ్చల్ పిఎస్ క్రైమ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి ట్రాప్ చేసి పలు మార్లు అత్యాచారానికి పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అయితే బాధితురాలి ఫిర్యాదు మేరకు క్రైమ్ పి సి సుధాకర్ రెడ్డి ని మేడ్చల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 31 సంవత్సరాల వయసు గల యువతి ఓ కేసు నిమిత్తం మేడ్చల్ పోలీస్ స్టేషన్ కు వచ్చింది. తిరిగి బయలుదేరేటప్పుడు పి సి సుధాకర్ రెడ్డి ఆమెను సంప్రదించి మీ సమస్య ఏంటి అని అడిగాడు. అప్పుడు ఆమె తన సమస్యను వివరించింది. పి సి సుధాకర్ రెడ్డి తన ఫోన్ నెంబర్ ఆమెకి ఇచ్చి న్యాయం జరిగేలా చూస్తానని నమ్మబలికాడు. మరుసటి రోజు సుధాకర్ రెడ్డి సదరు యువతిని పిలిచి న్యాయవాదిని పరిచయం చేస్తానని చెప్పి నాలుగు ఐదు రోజుల తర్వాత న్యాయ వాది తన ఇంటికి వస్తున్నాడని చెప్పి బలవంతంగా ఆ యువతిని తన ఇంటికి తీసుకెళ్లాడు. న్యాయవాది కోసం ఎదురుచూస్తున్నట్టుగా నటించి ఇంకా న్యాయవాది రాలేదు అని, తనకు వివాహం కాలేదని.. ప్రస్తుతం తాను బ్రహ్మచారిని అని చెప్పి నువ్వంటే నాకిష్టం, ఏ విషయంలోనైనా మద్దతు ఇస్తాను అంటూ హామీ ఇచ్చాడు. గతంలో ఒకసారి మోసపోయానని, కోర్టు చుట్టూ తిరుగుతున్నానని , ఎస్సీ మాదిగ కులానికి చెందిన యువతిని అని నాకు వివాహం మీద నమ్మకం లేదు వద్దు అంటూ నిరాకరించింది. నాకు కుల భావాలు లేవు, నిన్ను పెళ్లి చేసుకుంటానంటూ అంటూ బలవంతంగా అత్యాచారం చేశాడు. 15 రోజుల తర్వాత మళ్లీ తన తల్లిదండ్రులకు పరిచయం చేస్తానంటూ బాధితురాలిని ఇంటికి రప్పించుకున్నాడు. ఆ సమయంలో పిల్లల బట్టలు ఉన్నాయి ఇవి ఎవరివి అని బాధితురాలు నిలదీయగా ఈ బట్టలు మా సోదరుడి పిల్లల దుస్తులు అని మళ్లీ అబద్ధం చెప్పాడు . మళ్లీ ఆమెపై అత్యాచారం చేశాడు. అప్పటి నుండి ఆమెను వీడియోలు ఫోటోలు చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తూ అత్యాచారం చేశారు. ఈ సమయంలో ఆ బాధ్యత యువతి గర్భం ధరించగా పెళ్లి కాక ముందే తల్లి అయితే బాగుండదు గర్భాన్ని తొలగిస్తాను అంటూ బెదిరించడంతో బాధిత యువతి గర్భాన్ని తీసేయించుకునేందుకు నిరాకరించింది. బాధిత యువతికి బల వంతంగా అబార్షన్ మాత్రలు మింగించి అబార్షన్ చేయించాడు. కొద్ది రోజుల తర్వాత బాధితురాలు సుధాకర్ రెడ్డి కి ఫోన్ చేయగా ఆయన భార్య లిఫ్ట్ చేయడంతో ఎవరు నువ్వు అంటూ బాధితురాలు ప్రశ్నించగా తాను సుధాకర్ రెడ్డి భార్య ని సమాధానం ఇచ్చింది. ఇది విన్న బాధితురాలు షాక్ కు గురైంది. అయితే తనకు ఇంతకుముందే వివాహం అయిన ప్పటికీ భార్యతో తాను సంతోషంగా లేను అంటూ మళ్లీ ఆ బాధిత మహిళకు నచ్చ చెప్పాడు. ఈ క్రమంలో సుధాకర్ రెడ్డి బాధిత మహిళ ఇంటికి వెళ్లి బలవంతంగా పినాయిల్ ను తాగించాడు. అనంతరం బాధిత మహిళను ఆర్ఎంపీ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి చికిత్స చేయించి అక్కడి నుంచి అర్ధరాత్రి 12 గంటలకు సుధాకర్ రెడ్డి సదరు యువతని తన ఇంటికి తీసుకెళ్లాడు. అదే సమయంలో సుధాకర్ రెడ్డి భార్య సింధుజ యువతిపై దాడి చేసి చంపేస్తానని బెదిరించింది. అనంతరం సుధాకర్ రెడ్డి బాధితురాలి ఇంటి సమీపంలో తుమ్మ చెరువు వద్దకు తీసుకెళ్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే తీవ్ర పరిణా మాలు ఉంటాయని హెచ్చరించారు. డిసెంబర్ 10న మళ్లీ పీకల దాకా తాగి బాధితురాలు ఇంటికి వెళ్లి అసభ్యకరమైన పదజాలంతో తిడుతూ ఆమెపై దాడి చేసి మళ్లీ అత్యాచారం చేశాడు. డిసెంబర్ 16న బాధిత మహిళను గిర్మాపూర్ రోడ్డు వైపు తీసుకెళ్లి బైక్ పై నుండి కిందికి తోసేసాడు. బాధితురాలు తలకు తీవ్రమైన గాయాల తో స్పృహ కోల్పోయింది. స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ దగ్గర చికిత్స పొందిన అనంతరం సుధాకర్ రెడ్డి తో పాటు ఆయన భార్య సింధుజ తో ప్రాణహాని ఉంది అంటూ మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో బాధిత యువతి ఫిర్యాదు చేయడంతో క్రైమ్ పీసీ సుధాకర్ రెడ్డి ని మేడ్చల్ పోలీస్ అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు

# సినిమా

## ‘తండేల్’ మూవీ ఆజాది లిరికల్ వీడియో సాంగ్



అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హీరోహీరోయిన్లుగా చందూ మొండేటి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం ‘తండేల్’. ఫిబ్రవరి 7న థియేటర్లలో విడుదలయ్యేందుకు ముస్తాబైన ఈ సినిమా నుండి గురువారం ‘ఆజాది’ అంటూ సాగే లిరికల్ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ‘తండేల్’. చందూ మొండేటి దర్శకత్వంలో నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మించారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ హ్యూజ్ బజ్‌ని సినిమాపై క్రియేట్ చేయగా.. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ అందించిన మరో పాటను గురువారం మేకర్స్ విడుదల చేశారు. ‘ఆజాదీ’ అంటూ సాగిన ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా.. నకుల్ అభ్యంకర్ అలపించారు. ప్రస్తుతం ఈ పాట టాప్‌లో ట్రెండ్ అవుతోంది.

## ‘లైలా’ నుంచి నెక్స్ట్ అటాక్.. ‘పటక్’

ట్రైలర్ బయటకు వచ్చింది కాబట్టి.. నాకంటే ట్రైలర్ ఎక్కువ మాట్లాడాలని అనుకుంటున్నాను. ప్రీ రిలీజ్ ఈవెంట్ ఉంది కాబట్టి అక్కడ మాట్లాడుతానని అన్నారు మాస్ కా దాస్ విశ్వక్ సేన్. ఆయన హీరోగా నటించిన ‘లైలా’ చిత్ర ట్రైలర్‌ని గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈవెంట్‌లో మేకర్స్ విడుదల చేశారు.మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన ‘లైలా’ చిత్రం ఫిబ్రవరి 14న విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమాను దర్శకుడు రామ్ నారాయణ్ పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించగా.. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ప్రేమికుల దినోత్సవం స్పెషల్‌గా థియేటర్లలోకి రాబోతోన్న ఈ సినిమాలో విశ్వక్ సేన్ తొలిసారి లేడీ గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు బాగానే క్రియేట్ అయ్యాయి. ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ క్రేజ్‌ని పెంచగా.. తాజాగా చిత్ర ట్రైలర్‌ని హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఏ మాల్‌లో గ్రాండియర్‌గా విడుదల చేశారు.ఈ వేడుకలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. ‘లైలా’ ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. థియేటర్లలో మీరు నవ్వి నవ్వి మీ ఛాతి చపాతీ కావాలని డిసైడ్ అయ్యాం. కచ్చితంగా ‘లైలా’ మిమ్మల్ని బాగా నవ్విస్తుంది. ట్రైలర్ బయటకు వచ్చింది కాబట్టి.. నాకంటే ట్రైలర్ ఎక్కువ మాట్లాడాలని అనుకుంటున్నాను. ప్రీ రిలీజ్ ఈవెంట్ ఉంది కాబట్టి అక్కడ మాట్లాడుతా. లైలా నుంచి నెక్స్ట్ అటాక్ ‘పటక్’ రిలీజ్ అవుతుంది. ఆ సాంగ్ నేనే రాశా. ఆ సాంగ్ కూడా అందరికీ నచ్చుతుంది. ఫిబ్రవరి 14న అందరం థియేటర్లలో కలుద్దామని అన్నారు.‘లైలా’ ట్రైలర్ విషయానికి వస్తే.. లేడీస్ బ్యూటీ పార్లర్ నడుపుతున్న సోనూ మోడల్(విశ్వక్ సేన్) అనుకోకుండా స్థానిక ఎమ్మెల్యే విషయంలో ఏదో గొడవకు దిగినట్లు అర్థమవుతుంది. దీంతో ఎమ్మెల్యే మనుషులు అతడు దొరికితే చంపేందుకు ప్రయత్నిస్తుంటారు. ఈ పరిస్థితిలో తన ప్రాణాలను కాపాడుకోవడానికి సోనూ లైలాగా అవతారం మారుస్తాడు. ‘లైలా’గా లేడీ గెటప్‌లోకి మారిన విశ్వక్‌కు ఎదురైన సంఘటనలు ఏంటి? ఎమ్మెల్యేతో గొడవకు, సోనూకి సంబంధం ఏంటి? అనే విషయాలు సినిమాలో ఆసక్తికరంగా ఉండనున్నాయి. సోను మోడల్ పాత్రలో విశ్వక్ సేన్ యాక్టింగ్.. అతడు చేసే కామెడీ వేరే లెవల్ అన్నట్లుగా ఈ ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. ట్రైలర్ మొత్తం యూత్‌ని ఆకర్షించే డైలాగ్‌లతో నింపారు. ట్రైలర్ ఆద్యంతం ఫన్ రైడ్‌గా ఉండటమే కాకుండా.. లేడీ పాత్రలో విశ్వక్ సేన్ చేసే అల్లరి థియేటర్లలో ప్రేక్షకులను పడిపడి నవ్వేలా చేస్తుందనడంలో సందేహం లేదు. మరోవైపు హీరోయిన్ ఆకాంక్ష శర్మ తన గ్లామర్ షోతో యూత్ ఆడియెన్స్‌కు వెల్‌కమ్ చెబుతున్నట్లుగా ఉంది. మొత్తంగా అయితే ప్రేమికుల రోజున ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతుందనేది మాత్రం ఈ ట్రైలర్ తెలియజేస్తుంది.



# ఈ రెండు వెబ్ సిరీస్‌లపైనే.. అందరి చూపు!



నెట్‌ఫ్లిక్స్ రీసెంట్‌గా ఓ భారీ వేడుకను నిర్వహించి.. ఈ ఏడాది విడుదలయ్యే వెబ్ సిరీస్‌ల వివరాలను ప్రకటించింది. అందులో చాలా వెబ్ సిరీస్‌లు ఉన్నా.. రెండు మాత్రం అందరి దృష్టిని ఆకర్షించాయి. ఆ రెండింటి కోసం నెట్‌ఫ్లిక్స్ వీక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. వాటి విషయానికి వస్తే..నెట్‌ఫ్లిక్స్ రీసెంట్‌గా ఈ సంవత్సరం వచ్చే వెబ్ సిరీస్‌ల వివరాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో తమ నుంచి వచ్చే ప్రాజెక్టుల వివరాల్ని ఓ భారీ వేడుకపై నెట్ ఫ్లిక్స్ ప్రకటించింది. కామెడీ, ఫ్యామిలీ, యాక్షన్, రొమాన్స్, స్పోర్ట్స్, డ్రామా ఇలా అన్ని జానర్లను టచ్ చేస్తూ నెట్ ఫ్లిక్స్ ఈ ఏడాది ఊహించని స్థాయిలో వినోదాన్ని పంచేందుకు రెడీ అయింది. ప్రపంచ వ్యాప్తంగా 700 మిలియన్లకు పైగా వీక్షకులను సంపాదించుకున్న నెట్‌ఫ్లిక్స్ ఈ ఏడాది సరికొత్త కంటెంట్‌ను వీక్షకులకు ఇచ్చేందుకు ప్లాన్ చేస్తుంది. అయితే ఈ ఏడాది నెట్‌ఫ్లిక్స్ నుండి వచ్చే రెండు వెబ్ సిరీస్‌లపై ఇప్పుడందరి చూపు ఉంది. అవే ‘రానా నాయుడు’, ‘టెస్ట్’. ఆ వివరాల్లోకి వెళితే..మాధవన్, సిద్దార్థ్, నయనతార, మీరా జాస్మిన్ వంటి భారీ తారాగణంతో ఎస్. శశికాంత్ ‘టెస్ట్’ అనే వెబ్ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. ఏ వైనాట్ స్టూడియో బ్యానర్‌పై చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ నిర్మిస్తున్న ఈ ‘టెస్ట్’ వెబ్ సిరీస్ ‘జీవితమే ఓ ఆట’ అనే కాన్సెప్ట్‌తో రాబోతోంది. భిన్న మనస్తత్వాలు, భిన్న దారుల్ని ఎంచుకున్న ముగ్గురు వ్యక్తుల జీవితాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని.. లవ్, అంతులేని కలలు, లక్ష్యాలు, కోరికలు, క్రికెట్ వంటి ఎమోషన్స్ ఇందులో ఉంటాయని సిరీస్ టీమ్ తెలిపింది. ఈ సిరీస్‌ను నెట్‌ఫ్లిక్స్ వీక్షకులకు అందిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని నెట్ ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనిక షెర్గిల్ తెలిపారు.ఇక రెండోది ‘రానా నాయుడు’. మొదటి సీజన్ ట్రెమెండస్ రెస్పాన్స్ రాబట్టుకోవడంతో పాటు పలు కాంట్రవర్సీలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. అయినా కూడా సీజన్ 2పై బీభత్సమైన హైప్‌ని ఈ సిరీస్ క్రియేట్ చేసుకుంది. ప్రస్తుతం సీజన్-2 రెడీ అయినట్లుగా ఈ వేడుకలో చెప్పుకొచ్చారు. ఈ రెండో సీజన్‌లో రానా నాయుడికి ఎదురైన కొత్త సమస్య ఏంటి? తన ఫ్యామిలీని రక్షించుకునేందుకు రానా నాయుడు ఏం చేశారు? గతంలో చేసిన పనుల వల్ల ఏర్పడిన ఈ కొత్త సమస్యలు ఏంటి? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సీజన్ ఉండబోతున్నట్లుగా తెలుస్తోంది. ఈ సందర్భంగా లోగో మోటివ్ గ్లోబల్ మీడియా నిర్మాత సుందర్ అరోన్ మాట్లాడుతూ.. ‘రానా నాయుడు రెండో సీజన్‌ను అందరి ముందుకు తీసుకు వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఫస్ట్ సీజన్ కంప్లీట్ అయిన వెంటనే ఈ రెండో సీజన్ పనులు ప్రారంభించాం. ఈ రెండో సీజన్ స్టోరీ, స్క్రీన్ ప్లే, పెట్టిన బడ్జెట్ చూసి ఆడియెన్స్ ఫిదా అవుతారు. నెట్ ఫ్లిక్స్ సహకారంతో ఈ రెండో సీజన్‌ను అద్భుతంగా తెరకెక్కించాం. ఈ రెండో సీజన్ అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఎదురు చూపులకు తగ్గ ప్రతిఫలం దక్కిందని ఈ సీజన్ చూసిన వారంతా చెబుతారు’ అని పేర్కొన్నారు.

# మెగా ఫ్యాన్స్ ఫైర్



మెగా, అల్లు ఫ్యామిలీల మధ్య దూరం పెరిగిందా? అంటే, గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలు నిజమే అని అనిపిస్తున్నాయి. మరి ముఖ్యంగా అల్లు ఫ్యామిలీ, మెగా ఫ్యామిలీని టార్గెట్ చేస్తున్నట్లుగా ఈ మధ్య కొన్ని సంఘటనలు జరుగుతున్నాయి. ఈ నేపధ్యంలో ‘చిరుత’ను ఉద్దేశిస్తూ అల్లు అరవింద్ చేసిన కామెంట్స్ మెగా ఫ్యాన్స్ ఫైర్ అయ్యేలా చేస్తున్నాయి. ఇంతకీ అల్లు అరవింద్ ఏమన్నారంటే..అసలు మెగా, అల్లు ఫ్యామిలీల మధ్య ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. అభిమానులు కూడా మెగా, అల్లు అంటూ విడిపోయి సోషల్ మీడియాలో రచ్చ రచ్చ చేస్తున్నారు. సోషల్ మీడియాలో రచ్చ చేస్తే పరవాలేదు కానీ.. ఒకరి సినిమాలను మరొకరు కించ పరుస్తూ.. ఆఖరికి విడుదల రోజే హెచ్‌డి ప్రింట్‌ని సోషల్ మీడియాలో వదిలి.. సినిమాలను కిల్ చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాస్త పెద్దరికం ప్రదర్శించాల్సిన స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ కూడా.. మీడియా ముందు లేనిపోని కాంట్రవర్సీలకు ఊతం ఇస్తూ.. మెగా, అల్లు అభిమానుల మధ్య మరింతగా ఆగ్రహ జ్వాలలను రగిలిస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే..అవును.. అల్లు అరవింద్ తీరు చూస్తున్న వారంతా అనుకుంటున్న మాట ఇదే. పేరుకు ‘తండేల్’ మూవీ ప్రమోషనల్ ఈవెంట్సే అయినా.. ఆ ఈవెంట్స్‌లో ఎక్కువగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పేరు.. లేదంటే, ఆయన నటించిన సినిమాల పేర్లు ఎక్కువగా వినిపిస్తుండటం చూసిన వారెవరైనా సరే.. ఇదే మాట అనుకుంటున్నారు. రీసెంట్‌గా జరిగిన ‘తండేల్’ ప్రీ రిలీజ్ వేడుకలో దిల్ రాజుని పక్కన పెట్టుకుని ‘గేమ్ చేంజర్’ స్థాయిని తగ్గిస్తూ అల్లు అరవింద్ చేసిన కామెంట్స్ ఎలా వైరల్ అయ్యాయో తెలిసిందే. ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో ‘చిరుత’ సినిమాపై అల్లు అరవింద్ చేసిన వ్యాఖ్యలు మెగాభిమానులకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి. రామ్ చరణ్ డెబ్యూ మూవీ ‘చిరుత’ జస్ట్ యావరేజ్ ఫిల్మ్‌గా నిలిస్తే.. ఆ తర్వాత ‘మగధీర’ సినిమాతో పెద్ద హిట్ ఇచ్చాను అంటూ అల్లు అరవింద్ ఈ ఇంటర్వ్యూలో చెప్పడం కాంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

### ‘చిరుత’ జస్ట్ యావరేజ్ ఫిల్మా? అదెలా?

రామ్ చరణ్ హీరోగా పరిచయమైన చిత్రం ‘చిరుత’. ఈ సినిమాకు డ్యాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ దర్శకుడు. 2007లో రూ. 9 కోట్లతో తెరకెక్కిన ఈ సినిమా అప్పట్లోనే రూ. 25.23 కోట్ల షేర్‌ని రాబట్టి సంచలన విజయాన్ని నమోదు చేసింది. అంతేకాదు.. స్టార్ హీరోలైన మహేష్ బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్ వంటి వారు పరిచయమైన చిత్రాలు కలెక్షన్ల పరంగా తీవ్ర నిరాశను మిగిల్చితే.. రామ్ చరణ్ తన పరిచయ చిత్రంతో కలెక్షన్ల పరంగా రికార్డులు క్రియేట్ చేశారు. 2007లో సెకండ్ హయ్యెస్ట్ గ్రాసర్‌గా, తెలుగు చలనచిత్ర పరిశ్రమలో 8వ హయ్యెస్ట్ గ్రాసర్ చిత్రంగా అప్పట్లో ‘చిరుత’ రికార్డును క్రియేట్ చేసింది. అంతేకాదు, విడుదలైన చాలా సెంటర్లలో ఆల్ టైమ్ రికార్డ్స్‌ని క్రియేట్ చేసిన ‘చిరుత’.. ఇండియన్ సినిమా హిస్టరీలోనే ఒక స్టార్ హీరోకి అత్యుత్తమ తొలి చిత్రంగా, అత్యంత విజయవంతమైన తొలి చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ‘మగధీర’ రికార్డ్ బ్రేకింగ్ బ్లాక్‌బస్టరే కానీ.. ‘చిరుత’ యావరేజ్ సినిమా అయితే కాదు. రూ. 9 కోట్ల పెట్టుబడితో రూ. 25 కోట్లు సాధించిన సినిమాను జస్ట్ యావరేజ్ సినిమా అని, ఒక నిర్మాత ఎలా అంటారో.. అల్లు అరవింద్‌గారికే తెలియాలి.

### అప్పుడలా.. ఇప్పుడిలా.. ఇలా మాట మారిస్తే ఎలా?

తాజా ఇంటర్వ్యూలో ‘చిరుత’ జస్ట్ యావరేజ్ ఫిల్మ్ అని చెప్పిన అరవింద్.. ‘మగధీర’ సినిమా మేకింగ్ విషయంపై కూడా మాట మార్చారు. ‘‘నా మేనల్లుడు రామ్ చరణ్ కోసం ‘మగధీర’ సినిమాను భారీ బడ్జెట్‌తో రామ్ చరణ్‌తో సినిమా తీయాలని అనుకున్నప్పుడు రాజమౌళిగారితో డిస్కషన్ జరిగింది. రాజమౌళిగారు.. నాకు చిరంజీవిగారు ఒక 20 సంవత్సరాలుగా గీతా ఆర్ట్స్‌లో అనేక హిట్స్ ఇచ్చారు. ఇప్పుడు గీతా ఆర్ట్స్‌లో చరణ్ మొదటి సినిమా చేయబోతున్నాడు. నాకు అన్ని హిట్స్ ఇచ్చిన చిరంజీవిగారికి కానుకగా ఏం ఇవ్వగలను. చరణ్‌తో సినిమా.. ఏదో ఒకటి చేయాలి. ఎంత బడ్జెట్ అయినా పర్లేదు.. లాభనష్టాలకు అతీతంగా ఒక గొప్ప సినిమా తీసి, చిరంజీవిగారికి కానుకగా ఇవ్వాలని అనుకుంటున్నా. అటువంటి సబ్జెక్ట్ ఏదైనా చూడండి అని చెప్పగానే రాజమౌళిగారు ఎంతో ఆనందించారు..’’ అని చెప్పిన అల్లు అరవింద్.. తన తాజా ఇంటర్వ్యూలో మాత్రం మరోరకంగా చెప్పుకొచ్చారు. ‘‘నా మేనల్లుడు రామ్ చరణ్ మొదటి సినిమా వెరీ యావరేజ్ ఫిల్మ్‌గా నిలిచింది. ఆ తర్వాత సినిమాకు నేను నిర్మాతని. ఆ సినిమాతో రామ్ చరణ్‌కి బిగ్ హిట్ ఇచ్చాను. మంచి దర్శకుడిని సెలక్ట్ చేసి అంత ఖర్చు పెట్టడానికి అదే ప్రధాన ఉద్దేశ్యం. అది నా మేనల్లుడిపై నాకున్న ప్రేమ’’ అంటూ అరవింద్ చెప్పడంతో.. పాత వీడియోలను తెచ్చి మరీ అల్లు అరవింద్‌పై మెగా ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు.

### అసలిదంతా ఎందుకు?

అసలే ఈ మధ్య మెగా, అల్లు ఫ్యామిలీల మధ్య వార్ వాతావరణం నడుస్తుందనేలా వార్తలు మీద వార్తలు పుట్టుకొస్తుంటే.. ఆ వార్తలకు బ్రేక్ వేయాల్సిందిపోయి.. అల్లు అరవింద్ కూడా అదే రూట్‌లో వెళ్లడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇలా మాట్లాడటం మేనల్లుడిపై ప్రేమ ఎలా అవుతుందో ఆయనకే తెలియాలి అంటూ మెగాభిమానులు కొందరు డైరెక్ట్‌గానే కామెంట్స్ వదులుతున్నారు. అసలిదంతా ఎందుకు? కేవలం రామ్ చరణ్‌ని మాత్రమే ఎందుకు అల్లు ఫ్యామిలీ టార్గెట్ చేస్తుంది? అసలు మెగా, అల్లు ఫ్యామిలీల మధ్య ఏం జరిగిందనేది అంతుచిక్కని ప్రశ్నగానే ఉంది. ఈ అంతుచిక్కని ప్రశ్నకు సమాధానం దొరికి, ఆ రెండు ఫ్యామిలీల మధ్య దూరం ఉంటే తొలగిపోవాలని.. ఈ రెండు ఫ్యామిలీలను అభిమానించే డై హార్డ్ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## ఫ్యాన్స్ క్వశ్చన్స్.. సాయిపల్లవి ఏం చెప్పిందంటే

అభిమానులు అడిగిన ప్రశ్నలను నాగచైతన్య సాయి పల్లవి ముందుంచారు. ఆమె ఆసక్తికర జవాబులు ఇచ్చింది. నటన కాకుండా ఇంకేమంటే ఇష్టమని ప్రశ్నించగా తేనెటీగల పెంపకం అంటే ఇష్టమని, ఇటీవల మొదలు పెట్టానని చెప్పింది.

నాగచైతన్య, సాయి పల్లవిజంటగా నటించిన చిత్రం ‘తండేల్’. చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా అభిమానులు అడిగిన ప్రశ్నలను నాగచైతన్య సాయి పల్లవి ముందుంచారు. ఆమె ఆసక్తికర జవాబులు ఇచ్చింది. నటన కాకుండా ఇంకేమంటే ఇష్టమని ప్రశ్నించగా తేనెటీగల పెంపకం అంటే ఇష్టమని, ఇటీవల మొదలు పెట్టానని చెప్పింది. సాయిపల్లవి బన్‌తో తయారు చేసే ఆహారం కూడా ఇష్టమే, అలాగే కొబ్బరి నీళ్లు, రాత్రి 9 గంటలైతే ఎక్కడున్నా నిద్రపోవడం అలవాటు అని నాగచైతన్య చెప్పారు.

మీరు దర్శకత్వం చేయాలనుకుంటే..

అలాంటి ఆలోచన ఏదీ లేదు.

నాగచైతన్య: నువ్వు అబద్ధాలు చెప్తున్నావు. ఇదే విషయాన్ని అడిగితే, ‘ఎప్పటికైనా దర్శకత్వం చేస్తా నన్ను కూడా నటుడిగా తీసుకుంటానని చెప్పావు’

ఓం నమః శివాయలో చైతన్య డ్యాన్స్ చూసి మీకేమనిపించింది!

గతంలో చైతన్య డ్యాన్స్ చేస్తుండగా, అప్పుడప్పుడు వెనకడుగు వేసేవాడు. ఈ పాటకు మాత్రం ముందుకు దూకి మరీ ఇరగదీశాడు.

ఏదైనా ఫిక్షనల్ క్యారెక్టర్‌తో డిన్నర్ చేయాలనుకుంటే ఎవరితో ప్లాన్ చేస్తారు.

ఒక్కరితో కాదు. సింప్సన్స్ (అమెరికన్ యానిమేటెడ్ సిట్‌కామ్) కుటుంబంతో చేయాలనుంది.

అబ్బాయిలు డ్రెసింగ్ ఎలా ఉంటే ఇష్టం..

నాకు తెలీదు కానీ నలిగిపోయిన బట్టలు వేసుకుంటే నాకు నచ్చదు. నా ఫ్యామిలీ లో ఎవరైనా అలా కనపడితే, వాటిని సరి చేయడానికి ప్రయత్నిస్తా.

నాగచైతన్య: అబ్బాయిలు విన్నారుగా.. ఈసారి సాయిపల్లవిని కలేస ముందు, మీ డ్రెస్‌ను బాగా ఉతికి, ఇస్త్రీ చేసి వేసుకురండి.

శ్రీకాకుళంలో యాసలో మాట్లాడటం ఎలా అనిపించింది?

ఆ మాటలు పలకడానికి కాస్త ఇబ్బంది పడిన మాట వాస్తవం. గతంలో తెలంగాణ యాస నేర్చుకుని మాట్లాడా. అలాగే ఇది కూడా.

‘తండేల్’ సెట్‌లో చైతన్య చెప్పిన అతి పెద్ద అబద్ధం?

చైతన్య సెట్‌లో అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. నేను అక్కడలేని సమయం చూసుకుని, ‘పల్లవి నన్ను పిలిచి, ఆ సీన్‌లో ఇలా చేద్దాం.. అలా చేద్దాం.. అని చెబుతోంది’ అంటాడు. నా మాట వినిపించగానే సైలెంట్ అయిపోతాడు!

ఖాళీ సమయంలో ఏం చేస్తారు?

నేను నాలా ఉండటానికి ప్రయత్నిస్తాను. సినిమాలు చూస్తా. వంట చేయాలనుకుంటా కానీ, చేయలేను. ఆర్డర్ పెట్టి తినేస్తా తోట



పనిచేస్తాను. క్యారెట్లు పండిస్తాను.

వాట్సాప్ స్టికర్స్ వాడతారా?

కోతుల స్టికర్స్ ఎక్కువగా వాడతా.

Printed, Published and Owned by VELLENKI JAYAPAL REDDY, Printed at M/s KAKATIYA PRINTERS, H.No: 24-91/72/1, Block No. 29, Plot Nos. 72,73 and 74, Laxminarayana NagarIDA Uppal, Uppal Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 39. Published at H.No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 92,
Editor: VELLENKI JAYAPALREDDY, Cell: 9133445456,9346984911, RNI NO : TELTEL/2023/84471,
Website: www.nedudailynews com, e-mail: vellenkijayapalreddy@gmail.com.